
am-Jan-1947-15-16





చిన్న కిటుకు

సుశీల :— ఏం శాంతా, ఏమిటో దీర్ఘంగా ఆలోచిస్తున్నావు? అదోలా వున్నావేం?

శాంత :— ఏమీ లేదు, ఇదిఅంతా నా పూర్వజన్మ ఫలమేమో—

సుశీల :— నిన్నగాక మొన్న పెళ్లయింది, యింతలోనే వేదాంతమా! ఏమొచ్చిందేమిటి?

శాంత :— విస్తరిముందు కూచుంటారు; వడ్డించినవన్నీ రుచిచూస్తారు. యీ తిండి తినలేనంటూ లేచిపోతారు. కష్టపడి ఆయన్ని సంతోషపెట్టలేకున్నాను.

సుశీల :— ఓసి వెర్రిబాగులదానా! ఇది నువ్వేగాదు—నేనూ మావారిదగ్గర యిదంతా అనుభవించాను. మా యింట్లోనూ యింతే.—ప్రక్కయింటావిడ ఆ కిటుకు చెప్పేవరకూ!

శాంత :— కిటుకా? ఏమిటది?

సుశీల :— ఏమీ లేదు, అతి తేలికయింది. చేసిన కూరలు, పచ్చళ్లు, పులుసులు రుచిగా గుమగుమలాడుతూ వుండేలా చేయడానికి శాస్త్రయుక్తంగా తయారుచేయబడిన తిలక్ మిస్కీ ఇంగువ వాడుకోవాలన్నది.

శాంత :— ఆ, తరువాత—,

సుశీల :— ఆ తర్వాత యేముంది,—అలానే చేసాను. మావారిలో మార్పు! నేను వండిన ప్రతివంటా ఆప్యాయంతో ఇష్టంతో హితవుతో తినడం మొదలు బెట్టారు. దానితో నాపై వారికి ప్రేమ గౌరవ భావాలు యెక్కువైనై.

శాంత :— మరి అది యెక్కడ దొరుకుతుందో చెప్పూదూ—పుణ్యం వుంటుంది.

సుశీల :— తిలక్ మిస్కీ ఇంగువ అని అడిగితే యేకొట్టులోనైనా దొరుకుతుంది. లేదా గోపాల్జీ ఛాంపషీ కంపెనీకి వ్రాస్తే సరి.

గోపాల్ జీ ఛాంపషీ అండ్ కో

30, గోవిందప్పనాయక వీధి, మద్రాస్.



సహృదయంతో చేసిన కృషి ఏదిగాని, సజ్జనామోదం పొంది, సాఫల్యం గడింపకపోదన్న విశ్వాసంతోనే ఆంధ్ర మహిళా సభ సేవా జీవితము నలవరచుకొంది. ఈ విశ్వాసమే మాకు వెలుగై సేవారంగంలో ముందడుగు వేస్తోంది.

దేశోద్ధారకుడు నాగేశ్వరరావు పంతులుగారి దివ్యస్మృతి చిహ్నముగా శిశు సంరక్షణాలయము నెలకొల్పవలెనని అభిలషించి చేతిలో పైకములేకయే ఏర్పాట్లన్నీ చేసి, జగజీవన్ రామ్‌గారిని ఆహ్వానించాము. మూడు దినములలో ముప్పైఫ మంది విద్యార్థినులు, సభ్యురాండ్రు కలిసి సుమారు మూడు వందల కుటుంబాలను సందర్శించి, వారికి నచ్చజెప్పి, విరాళాలు పోగుచేశారు. ఒక్కొక్కరు ఏబది రూపాయలు చొప్పున ఆరుగురు, ఇరువదియైదు రూపాయలు వంతున ముప్పది మంది, పది రూపాయలు వంతున అరువదియైదు గురు, అయిదు రూపాయలు వంతున ఎనభై ఆరుగురు, రెండేసి రూపాయలు చొప్పున ఏబదినలుగురు వుత్సాహంతో, నిండు హృదయంతో నాగేశ్వరరాయ శిశు సంరక్షణాలయానికి సమర్పించారు. వారికి మా కృతజ్ఞత. ఈ మొత్తం రు. 2,238 లు యీ సంస్థకు ఒక చిన్న గృహం నిర్మించడానికి వినియోగపడుతుంది. ఈ ఆరు నెలలూ అయినపిదప మా విద్యార్థినులూ, సభ్యురాండ్రూ తిరిగి ఆరువేలు సమీకరించ గలుగుతారని మా దృఢమైన నమ్మకం.

పచ్చయప్ప కళాశాల ప్రిన్సిపాలు శ్రీ బి. వి. నారాయణస్వామి గారు రు. 51 ల కానుక పంపారు. వారికి మా నమస్కృతులు.

సోదరీమణులు వై. వెంకటేశ్వరమ్మగారు, కె. సుగుణమణిగారు చెరి వంద రూపాయలు విరాళములిచ్చి, యీ సంక్రాంతి శుభ సమయమున ఆంధ్ర మహిళా సభ యావజ్జీవ సభ్యురాండ్రుగా ఎన్నుకోబడ్డారు. మా అభివందనాలు.

బరోడా మహారాజు హిజ్ హైనెస్ ప్రతాప్ సింహా గారు, వారి సతీమణి మహారాణి సీతాదేవిగారు మా సభను సందర్శించి, చిన్నమాంబ విద్యామందిర నిర్వహణకుగాను పదివేల రూపాయలు విరాళమిచ్చారు. వీరికి మా హృదయపూర్వకమైన కృతజ్ఞతాభి వందనములు.

మా సభచే నిర్వహింపబడుచున్న రాజ్యలక్ష్మి పారిశ్రామిక విద్యాలయమునకు మద్రాసు ప్రావిన్షియల్ కోఆపరేటివ్ బ్యాంకువారు అయిదువందల రూపాయలు సంక్రాంతి కానుక అందజేశారు. ప్రతీ సంక్రాంతికీ యీ కానుక అందుతూనే ఉంటుందని నమ్ముతూ బ్యాంకువారికి కృతజ్ఞతను విన్నవిస్తున్నాము.

ఈ సంక్రాంతి శుభ సమయమున మాకు కానుకలతో దీవెన లిచ్చిన సోదర, సోదరీమణులకు కార్యరూపేణా కృతజ్ఞత సూచించుకుంటున్నాము.

సంక్రాంతి కానుకలు

ఆంధ్ర మహిళ

మైలాపూరు :: జాన్యువరి 1947 :: మదరాసు

: ముఖచిత్రం :

సంక్రాంతి సుమములు, మా కళాశాఖా
పాపాయిలు-ఉష, అరవింద, సత్యము,
సంక్రాంతి కానుకలు.
స్త్రీలకు భూమిహక్కు
—సంపాదకీయం
పశుప్రాయుడైన పతి ప్రాపించిన సతి
—గాంధీజీ
గ్రామ సేవికల శిక్షణ
—శ్రీమతి డి. యస్. విద్యాదేవి
విద్యాశాఖలో స్త్రీలు
—ప్రభుత్వోగియగు స్త్రీ విలేఖరి
నిర్మలాదేవి స్మారకసభ
అభ్యర్థన
—శ్రీమతి దొప్పలపూడి అనసూయ
అధిక సంతానము
—శ్రీ రామచంద్ర అగస్త్య
ధన్యజీవి
—శ్రీమతి సరిపల్లి జ్ఞానాంబ
భావిసంఘములో స్త్రీలస్థానము
—శ్రీమతి పద్మావతీ శ్రీరామ్
దీపావళి (చిన్న కథ)
—శ్రీ కొడవటికంటి కుటుంబరావు
మాల వెంకికి దేవాలయ ప్రవేశము
—వనమాలి
శీల రక్షణ (కథ)
—శ్రీమతి సుగుణ అగస్త్య
స్త్రీలు చదువవలసిన పుస్తకాలు
—శ్రీమతి మొసలికంటి వెంకటరమణ
బడీ మా (కథ)
—శ్రీ కె. లింగరాజు
మందుల మనిషి
—శ్రీమతి తాతాని సుబ్బులు
మహిళలలో జాగృతి
—దుగ్గిరాల, తాడేపల్లి గూడెం, విజయనగరం, పశ్చిమగోదావరి మహిళాసంఘాల కార్యకలాపాలు.
గ్రంథ సమీక్ష

సంవత్సర చందా ★ అయిదు రూపాయిలు

ఆంధ్రమహిళ

సంపుటి 3 · జనవరి 1946 · సంచికలు 15, 16

స్త్రీలకు భూమిహక్కు

మన దేశంలో స్త్రీలకు ఏ విధమైన ఆస్తిహక్కులూ లేకుండా చేసేశారన్నది సర్వజన విదితమే. ఏమంటే, 'చిన్నప్పుడు తల్లిదండ్రులు, వివాహమయ్యేక భర్త, ఆ వెనుక తన సంతానము ఆమెను సంరక్షిస్తారు. స్త్రీలకు ఆస్తులెందుకూ!' అన్నారు. ఈ దృక్పథం కాలపరిణామంలో పరివర్తన చెందవలసిందిగా యున్నా, అడుగడుక్కీ అడ్డంకులే బయలుదేరుతున్నాయి.

అసలు మనదేశం వ్యవసాయమే ముఖ్యవృత్తిగా గలది. ప్రజల ఆస్తి విస్తారంగా భూస్థితిగా నుండవలసింది. ఐనా, జమీందారీలని, అగ్రహారాలని ఇలా ఎన్నో బాపతులుగా యేర్పడి, భూమి దున్నుకునే అతడికి తన భూమిమీద హక్కులేకుండా ఉండేపరిస్థితుల్లోకి తెచ్చారు. ఎలాగైతేనేం 1908లో గవర్నమెంటు 'ఎస్టేటు ల్యాండు ఆక్టు' ప్రవేశపెట్టారు. ఒకప్పుడు హయాం వెలిగించిన జస్టిసుపార్టీవారు 'ఈనాందార్ల చట్టు' మని ఒకటి చేశారు. కాంగ్రెస్ వారు 'రైతు ఉద్యమం' అంటూ లేవదీశారు. డా॥ పట్టాభి, బి. ఎన్. రావు లాంటివారు విమర్శలుజరిపారు. వీటన్నిటి సారాంశం యేమిటంటే— భూమి దున్నుకునే రైతుకు, రాజుకు మధ్య దళారీలు ఉండకూడదు అన్నదే.

ఆ కథ అలాయుంటే, 1937 లో కేంద్రశాసనసభవారి పుణ్యమా అంటూ స్త్రీలకు భర్తతాలూకు స్థిరాస్తిలో వారసత్వపుహక్కు కలుగజేయబడింది. ఐనా దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వడన్నట్టు మళ్ళీ అడ్డంకు లేర్పడ్డాయి.— ఒక కేసు, ఫెడరల్ కోర్టువారి విచారణకు వెళితే—ఇది సాగుభూములకు వర్తించదని తీర్పునిచ్చారు. కారణం ఏమిటంటేనట:— మన దేశంలో తండ్రి ఆస్తిని భాగించుకొని కుమాళ్లు వంశపారంపర్యా అనుభవించే యేర్పాట్ల ప్రకారం సాగుభూములు చిన్నచిన్న కొంద్రలైపోయి, ఆఖరుకు సాగుకు లాభకరంగాలేని చీలికల్లాగ తయారౌతున్నాయట. దీనివల్ల ప్రజలకు సరిపడ్డా పంటలు పండడానికి యిబ్బందిగా ఉందట. దీనికితోడు ఇంక ఆడపిల్లలుకూడా ఇలా పంచుకోవడం మొదలెడితే ఈ అనర్థాల కంతుఉండదట. ఎలాగైతేనేం స్త్రీలకు భూమిహక్కు సంక్రమించడం అల్ట్రావైరస్ అంది ఫెడరల్ కోర్టు!

దీనిమీద రాష్ట్ర ప్రభుత్వాలు అమెండ్మెంట్లు (సవరణలు) చేయవలసివచ్చింది. కరాచీ కాంగ్రెస్ ప్రాథమిక హక్కు సూత్రాల్లో స్త్రీలకు న్యాయం సూచించబడింది. ఇతర రాష్ట్రాలన్నీ స్త్రీలకు భూమిహక్కు లిచ్చాయి. మన మద్రాసువారు మాత్రం, ఆఖరుకు ప్రజాందోళన జరగ్గా జరగ్గా, మొన్నను 1946 నవంబరు 26 గెజిట్లో దీనికి సంబంధించిన బిల్లు ప్రకటించారు. ఇంతాచేసి, దాంట్లో ఏమి సూచించారంటే— 'ఈ బిల్లు శాసనమైనప్పటినుంచీ యీ నిబంధనలు ఆచరణలోకి వస్తాయ'న్నారు! 1947జనవరి నెలాఖరున శాసనసభ్యుల సమావేశం జరుగబోతూయుంది గనుక, స్త్రీ లోకానికి, ప్రభుత్వంవారికీ మా హెచ్చరిక యేమిటంటే:-1937 ఏప్రియల్ 14వ తేదీనుండి భర్తలు చనిపోయిన వారి ఆస్తులు అన్యాక్రాంతాలైపోయి అనేక కడగండ్లుపాలయ్యారు; ఔతున్నారు. ఈ బిల్లు కొంచం సవరణచేసి, ఆ తేదీనుండీ యిది వర్తించేటట్లు చేయడం చాల న్యాయదాయకం. లేకుంటే స్త్రీలకు చాల అన్యాయం జరుగుతుంది. ఇలా రిట్రాస్పెక్టివ్ ఎఫెక్టు ఇవ్వడానికి ఎంతమాత్రం అభ్యంతరం ఉండరాదు. ఎందుకంటే రైతుబుణ విమోచనచట్టం అమల్లోకివచ్చినప్పుడు ఇలా వెనుకటినుంచీ యిది వర్తించేటట్లు శాసనంచేశారు. అలాగే ఈ బిల్లుకూడా సవరణ చేయడానికి ఇది యిప్పుడు శాసనమయ్యే తేదీనుండిగాక, 1937 ఏప్రియల్ 14 వ తేదీనుంచీ వర్తించేటట్లు చెయ్యాలని స్త్రీలు ఆందోళన చేయడం, ప్రభుత్వం గమనించడం ఈ నెలాఖరుకే జరగాలి. ఇది మన స్త్రీలోకాని కంతటికీ సంబంధించిన సమస్యయై యుందని మళ్లీ హెచ్చరిస్తున్నాం.

★

దేశోద్ధారకుని స్మారక చిహ్నము

శ్రీ జగజీవన్‌రామ్ గారు శిశు సంరక్షణా లయ ప్రారంభోత్సవం జరిపి, యిలా ప్రసంగించారు: శ్రీమతి దుర్గాబాయమ్మగారి శక్తి సామర్థ్యాలు ప్రజాపరిషత్తు సమావేశంలోనే కొంత వరకు తెలుసుకోగలిగానని, ఇప్పుడు ఈ మహిళా సభ చూచినతర్వాత ఆమె సామర్థ్యం పూర్తిగా బోధపడ్డదని అన్నారు. ఇలాంటి స్త్రీలచే నెలకొల్పబడిన సంస్థలే దేశానికి ఎక్కువ సేవచేయ గలవని, హిందూసంఘంలో పురుషులకంటె స్త్రీలకు ఎక్కువ ప్రాధాన్యతవుందని, మన దేశం యొక్క భావిభాగ్యోదయం వారిపైనే ఆధారపడి వుందని, ఐనా యీ విషయం వారు మరచిపోయి పురుషులతోబాటు సమానహక్కులు కావాలని పోరాడుతున్నారని అన్నారు. ఇకనైనా తమ కర్తవ్యాలను గుర్తించి, దేశాభ్యుదయానికి పాటుపడాలని, ఇందుకు తర్ఫీదు నివ్వడానికి ఆంధ్ర మహిళా సభలాంటి సంస్థలు తప్పక తోడ్పడుతాయని అన్నారు. విశ్వదాత స్మారకంగా నెలకొల్పబడ్డ యీ శిశు సంరక్షణాలయం అనతికాలంలో మహోన్నతమైన సంస్థగా పరిణమించ గలదని ఆశీస్సు లిచ్చారు.

తర్వాత సర్ అల్లాడి కృష్ణస్వామి అయ్యర్ గారు ఉపన్యసిస్తూ, మన దేశంలో యిట్టి సంస్థలు నెలకొల్పడమే కష్టమనీ, నెలకొల్పినా, వాటిని నిర్వహించ గలగడం మరింత కష్టమని చెబుతూ, ఈ నాడు ఆంధ్ర మహిళాసభ స్త్రీలోకానికి యింత సేవచేయ గలగడానికి కారణం దుర్గాబాయమ్మగారి అకుంఠిత దీక్షే కారణమనీ, యిప్పుడు ప్రారంభింపబడిన శిశు సంరక్షణాలయం కూడ భారతదేశానికంతటికీ ఆదర్శంగా నుండ గలదని ఆశీర్వదించారు. — కె. సు.


★

అఖిలయొక్క అజ్ఞాతవాసం

ఎప్పుడు చూచినా సినీమాకో, డ్రామాలకో, టీపార్టీలకో, బీచికో చాల సరదాగా తిరుగుతూవుండే అందమైన అఖిల ఇప్పుడు హటాత్తుగా ఎక్కడికీ రాకుండా అజ్ఞాతవాసం చేయడం ప్రారంభించింది. ఆమె స్నేహితురాలైన రుక్మిణికి యిది చాల వింతగా కనపడింది. నిజానికి పెద్ద చెప్పుకోతగ్గ కారణమేమీ లేదు కాని అసలు సంగతి యిది. ఎందువల్లనో అఖిలయొక్క జుట్టు కుచ్చుకుచ్చులుగా రాలిపోయి తల అంతా మచ్చలు, మచ్చలుగా పడటం ప్రారంభమయింది. దానివల్ల ఆమె అందమంతా పోయింది. అందుచేత పాపం, అఖిల పై వాళ్లకు తన తల చూపెట్టలేక ఇంటిలోనే కూర్చుండి పోయింది. ఈ విషయం తెలుసుకున్న ఒక స్నేహితురాలు అఖిలను జాబ్‌కో హెయిర్ గ్రోయర్‌ను ఉపయోగించమని మరీమరీ చెప్పింది. ఆ సలహా ప్రకారం ఆ నూనె వాడింది. కొద్ది కాలంలోనే జుట్టు వూడడం ఆగిపోయి, ఒత్తుగా నిగనిగలాడుతూ జుట్టు పెరగడం ప్రారంభించింది. అఖిల ఇప్పుడు ముందుకంటె పదిరెట్లు ఎక్కువ అందంగా కనబడుతుంది. యధాప్రకారంగా ఇప్పుడు ఉత్సాహంగా తిరుగుతుంది.

జాబ్‌కో హెయిర్ గ్రోయర్ అపూర్వమైన మూలి
కలచేత, గొప్ప అనుభవమున్న శాస్త్రజ్ఞులవల్ల
తయారు చేయబడుతోంది. జుట్టు వూడడంమాన్పి,
జుట్టు ఒత్తుగా పొడవుగా పెరిగేటట్లు చేస్తోంది.

★ జాబ్‌కో హెయిర్ గ్రోయర్ ★



బర్మాదేశీయుల నిత్యజీవితము పూర్వపద్ధతిలోకి వచ్చు కొలదివారి పూర్వా
చారములుకూడా తిరిగి ప్రారంభింపబడుచున్నవి. టీ త్రాగుట ప్రతి కుటుంబ
ములో తప్పని ఒక అలవాటు. విధవిధ బ్రూక్ బాండ్ తేయాకు తాజాగా
నుండుటలో పేర్గాంచినందున భారతదేశపు నలు దిశలలోవలె బంగారు పగో
డాలుగల బర్మాలోకూడా జనప్రియముగా నున్నది.
బ్రూక్ బాండ్
రెండాకులు ఒక మొగ్గ



గాంధీజీ ఏమంటారు?

ఒక సోదరుడు, తన సోదరియొక్క జీవిత కష్టాల్ని గురించి గాంధిజీకి వ్రాసిన జాబుయొక్క సారాంశం :—

“కొన్నాన్నాళ్ల క్రితం మా సోదరిని, అతడి, ప్రవర్తన మాకు తెలియక పోవడంవల్ల వానికిచ్చి పెళ్ళిగావించడం జరిగింది. తర్వాత నతడు మూర్ఖ శిరోమణియని, ఎంతటి కామ వ్యభిచారత్వమైనా అతణ్ణి సంతుష్టి పర్చడంలేదని తెలిసింది. గౌరవమంటేకూడా యేమిటో అతడికి తెలియదు. దురదృష్టవంతురాలైన మా సోదరి, పెళ్ళియైన అచిరకాలంలోనే తన ప్రభువు దిన దినం దిగజారి పోతున్నాడని కనిపెట్టింది. అతని ప్రవర్తనకు అయిష్టత తెలిపింది. ఆ పెద్ద మనిషి యిందుకోర్చుకోలేక, ఆమెకు పాఠాలు నేర్పడానికని, ఆమె కళ్లెదుటనే అతిగాప్రవర్తించ మొదలెట్టేడు. ఆమెను కొరడాతో కొట్టడం, నిలువుకాళ్లమీద నిలబెట్టడం, అన్నపానాలు లేకుండా మాడ్చడం వగైరా చర్యలూ జరిగేయి. తాను వ్యభిచరిస్తుండగా చూడ్డానికని ఆమెను ఎదురుగా స్తంభానికి కట్టేసేవాడట. మా సోదరి గుండె పగిలిపోయింది. ఆమె పాట్లు విని మాకు తీరని పరితాపం కలిగింది. నిస్సహాయులమైపోయేం. మాకూ, ఆమెకూ మీ సలహా యేమిటి? హిందూ మతంలో యిదొక శోచనీయమైన విషయం—స్త్రీ పూర్తిగా పురుషుడు దయాదక్షిణ్యాల్లో విడవబడ్డం, ఆమెకు ఏ విధమైన హక్కులు స్వేచ్ఛలు లేక పోవడం. భర్త గనుక కఠినుడై, హృదయం లేనివాడై యుండాలనుకుంటే, నిర్భాగ్య స్త్రీకి మరొక గత్యంతరం లేదు. పురుషుడు తన యిష్టానుసారంగా నీతి తప్పి వ్యభిచరిస్తుంటే ఎవ్వరూ చిటికెన వ్రేలైనా యెత్తరు; గాని, స్త్రీకి వివాహమైంది మొదలు—యిక ఆమె జీవితం పూర్తిగా భర్త దయాదాక్షిణ్యాలమీద ఆధారపడియుంటుంది. ఇలాంటి స్త్రీలు వేలకువేలు మూల్గుతూ ఏడుస్తూ జీవిస్తున్నారు. హిందూ మతంలోనుంచి యిలాంటి వాటిని కడిగివేయకుంటే అభివృద్ధికేమైనా అవకాశ ముంటుందా” అని.

ఇందుపై గాంధీజీ జవాబు :

“వ్రాసిన ఆయన విద్యావంతుడు. పైన జెప్పిన దానికంటె తన సోదరి కడకండ్లు అశ్రురాలా ఏకరువు పెట్టేడు. నాకు వ్రాసిన ఉత్తరంలో తన పూర్తి పేరు, చిరునామా లిచ్చేడు. ఏదో ఒక్క పండితమన్యుడి! ప్రవర్తనను బట్టుకుని, హిందూమతంమీదే దాడి

పశుప్రాయుడైన పతి ప్రాపించిన సతి

తీసేడు. పాపం అతను అనుభవించిన మనోవ్యథ వల్ల యిలా వ్రాసేడని మనమిందులకు క్షమించ వలసియుంది. ఎందుకంటే, కోటానకోట్ల హిందూ సతీమణులు శాంతిమయ జీవితాలు సాగిస్తూ తమ గృహసామ్రాజ్యాల్ని పట్టమహిషుల్లాగ నేలుకుంటున్నారు. పైగా వాళ్లు అనుయాయవర్తిను లేగా — వీరు తమ భర్తలు తమకు అనుకూలురై యుండేట్లుగా చేసుకోగలిగేరు. ప్రేమవల్ల సంక్రమించిన 'అథారిటీ' యిది. పై లేఖ వ్రాసిన ఆయన చెప్పిన సిద్ధాంత్యాన్ని కృత్యాలు, హిందూ మతానికి అంటగట్ట వలసినవి గాదు; మానవుల లోని దుర్గుణాలు, అన్ని ప్రాంతాల్లోను. ప్రపంచంలో అన్ని మతస్థుల్లోను యిలా వ్యక్తీకృత మైనట్లు అంతా యెరిగిందే. డైవోర్సులకు సౌకర్యాలు కల్పించడంవల్ల, క్రూరులైన భర్తల నుండి (అమాయకులైన స్వతంత్రంగా వ్యవహరించ లేనివారైన) భార్యలకు ఏమీ విముక్తి లభించదు. అంచేత సంస్కరణలను తీసుకురావాలనే సంస్కర్తలు, పిచ్చిగా అతిశయోక్తులు పల్కకుండా ఉండటం తమకే శ్రేయోదాయకమని గమనించాలి.

ఐనా, పైన వర్ణించబడ్డ చేష్టలు, హిందూ సంఘంలో అంతగా జరుగనివి గాదు. హైందవ నాగరికత, భార్య భర్తకు యెక్కువగా లొంగి ఉండాలన్న వైపుకే మ్రొగ్గింది; భార్య భర్తల్లో పూర్తిగా ఐక్యమై పోవాలని శాసించింది. దీని ఫలితంగా, ఒక్కొక్కప్పుడు భర్త అధిక అథారిటీ చెలాయించి పశుప్రాయుడై పోవడం తటస్థిస్తుంది. అంచేత ఇలా అతిగా ప్రవర్తించే సందర్భంలో తరుణోపాయం యేమిటంటే—లా కోర్టుల ద్వారా గాక, వివాహితులైన స్త్రీలకు నిజమైన విజ్ఞానాన్ని కలిగించడమున్నూ, పురుషులు పశుప్రాయులుగా ప్రవర్తించకుండా ప్రజాసందోహంతో ప్రబోధం జరిగించి జనవాక్యం సన్నింపజేసేట్లు చేయడమున్నూ. పైన చెప్పిన ప్రబుద్ధత! వివాహితులకో చాల తెల్విగల మందు ఉంది. ఆ అమ్మాయి సోదరుడు, బంధువులు నిస్సహాయులై పోయినట్లు విలపించడం కంటె, ఆమెకు ధైర్యం యేర్పరచి, ఆమెను విజ్ఞానవంతురాల్ని గావించాలి: పాపాత్ముడైన భర్తతో విరోధించడంగాని, అతడితో కలిసి కాపురం చేయడం గాని ఆమెకు 'విధి' (తప్పని సరి)గాదని నచ్చజెప్పాలి. భర్తయే, తన భార్యను లక్ష్యంచేయండం లేదని తెల్లమాతూనే యుంది. అంచేత సంబంధం త్రెంచుకో నక్కరలే కుండానే, అతని గృహం విడిచి పెట్టి, ఆమె తన కెప్పుడూ వివాహంకా లేదన్నట్లుగా జీవించడమే. విడాకులు లేని హిందూ సతీమణులకుకూడ యిలాంటప్పుడు రెండు మార్గాలున్నాయి: తన్ను హింసించిన భర్తను శిక్షింపచేయవచ్చు, తనకు మనోవర్తినిచ్చి తన్ను పోషించేటట్లు పట్టుబట్టొచ్చు. నా అనుభవంవల్ల నేను తెలుసుకున్న దేమిటంటే— యీ పద్ధతివల్ల (అన్ని కేసుల్లోనూ గాక పోయినా, కొన్నిట్లోనైనా) పరిస్థితులు ఎంతమాత్రము చక్కబడ లేదని, యీ విధానం నిరర్థకమైనదన్న విషయం. ఇది సలక్షణవతికి ఏమీ శాంతి నివ్వదు సరిగదా భర్తను సంస్కరించడం దీనివల్ల అసాధ్యంగాక పోయినా మరింత దుర్ఘటమైపోతుంది. భార్యగాని, సంఘం

గాని వాంఛించేది యిది కానే కాదు. ప్రస్తుత విషయములో ఈ అమ్మాయిని తల్లిదండ్రులు పోషించాలి; ఇది సాధ్యంగాకపోతే ఇలా దుస్థితి పాలైన స్త్రీలను సంరక్షించే సంస్థల సంఖ్య దేశంలో హెచ్చుతుంది. ఇంకా ఒక సమస్య మాత్రం ఉండి పోతుంది:—తమకు ఆశ్రయమివ్వలేని భర్త గృహాలకు దూరమైనట్టి, విడాకులవల్ల తమ కష్టాలు నివారణ కానట్టి—స్త్రీలు యౌవ్వనులైయున్న యెడల వారి కామేచ్ఛ సంతృప్తి అన్న విషయం. కాని, ఇది నిజంగా, ఆట్టే మందికి అంతక్లిష్ట సమస్యగాదు. యుగయుగాలుగా విడాకులంటే అంతగా మోజుపడని సంఘంలో తన వివాహం సౌఖ్యప్రదంగా లేక పోయినప్పుడు ఆ స్త్రీ పునర్వివాహం చేసుకొందుకు యిష్టపడదు. ఈ విధంగానే ఆమె బాధ నివారణ జరగాలని ఒక సంఘంలో జనవాక్యం యిందుకు సుముఖమైయున్నట్లైతే, ఆ విధంగానే ఆమెకు సహాయం జరగడానికి అభ్యంతరముండదని నేను విశ్వసిస్తున్నాను. లేఖకుని జాబు నేను అర్థంచేసుకున్నంత వరకు ఆ అమ్మాయి తన కామేచ్ఛను సంతృప్తి పరచుకోలేక పోయిందన్న విషయంగాదు, భర్త ఎవళ్లనీ లెక్కచేయకుండా అతి నీతి విహీనుడుగా ప్రవర్తిస్తున్నాడన్నదే ఆమె గోల. ఇందుకు ముందు నేను చెప్పినట్లు మానసిక దృక్పథం మార్చాలన్నదే కర్తవ్యం. నిస్సహాయులమనుకునే భావం, మిగతా మన అనేక రుగ్మతల్లాగే, ఊహాజన్యం మానసికం. ఇలా లోపాలున్న ఊహాలవల్ల తెచ్చుకున్న విచారాన్ని పోగొట్టుకోడానికి నూతన దృక్పథమూ, కొంచెం స్వతంత్ర యోచనా చాలు. ఇలాంటి కేసుల్లో మిత్రులూ, బంధువులూ, ఆమెను బాధపడే ప్రాంతాన్నుంచి తప్పించే కేవలం వెనక చూపుతోటే సంతృప్తిపడరాదు; ఆమె సంఘసేవకు పూనుకొనేటట్లు ప్రోత్సాహించాలి. ఈ మాదిరి శిక్షణ, భర్త ప్రక్కను శయనించ లేదేనన్న సందేహాస్పదమైన అవకాశం కంటె అతి ఉత్కృష్టమైన నష్ట పరిహారమై యుంది.

★

హాస్టల్ వార్షికోత్సవము

ఆంధ్ర మహిళాసభ వసతి గృహ విద్యార్థినులకై ఏర్పరచిన యీ క్రింది ఆటలలో నెగ్గిన వారు.

1. Potato Race—శ్రీమతి ఈశ్వరి, తిమ్మాబాయి, రాజేశ్వరి, శకుంతల
2. Blind drawing—సి. హెచ్. రాజేశ్వరి
3. Passing the ball—మైత్రి
4. Sir, Sir—సి. భార్గవి, సి. హెచ్. రాజేశ్వరి
5. Memory game—సి. భార్గవి
6. Hidden Proverbs—సి. భార్గవి
7. Skipping—వి. అచ్చాయమ్మ


★

గ్రామసేవికల శిక్షణ

శ్రీ కస్తూర్బాగాంధీ జాతీయ స్మారకనిధి యాజమాన్యమున 31-12-46 సాయంత్రము 5-15 గంటలకు బొబ్బిలి సంస్థాన విద్యాశాలలో మంత్రసానుల శిక్షణ కేంద్ర ప్రారంభోత్సవము జరుపబడెను. బొబ్బిలి దివాన్ సాహెబుగారైన శ్రీయుత [illegible] నాయుడుగారు అధ్యక్షత వహించిరి. సంస్థానోద్యోగులు, గ్రామస్థులు తదితర పుర ప్రముఖులు సభకు విచ్చేసిరి. ప్రార్థన, జెండావందనము, సూత్రయజ్ఞము జరిగిన పిదప అధ్యక్షులు తదితరులు ఉపన్యసించిరి. సంయోజకురాలు స్మారకనిధి ఆదర్శములను, కార్యక్రమమును, తెలియజెప్పి విద్యార్థినులను సభికులకు పరిచయము చేసిరి. పిమ్మట అధ్యక్షులు నేటి భారతదేశ స్త్రీల దాస్యస్థితినిగూర్చి విపులముగా సంభాషించి, అట్టి సోదరీమణులను ఉద్ధరణకై ముందంజ వేసి వచ్చిన సోదరీమణులందరికి స్వాగత మిచ్చి బొబ్బిలి సంస్థానము సర్వవిధముల సాయపడ గలదని పల్కిరి. శ్రీ కె. సీతారామ శాస్త్రిగారు, ఎ. నారాయణమూర్తిగారు మొదలైన కాంగ్రెసు వాదులు విద్యార్థినులను ఆశీర్వదించి బొబ్బిలి పురవాసుల సహాయము వీరికి ఎల్ల కాలము లభించగలదని వ్రాక్కుచ్చిరి.

ఆహ్వానము నంగీకరించి నందులకు సభికులకు, అతి ధారాళముగ ఇదివరలో 40 వేల రూప్యములు విరాళము నిచ్చుటయే కాక శిక్షణార్థము వైద్యశాల, వసతి గృహమునకై ఒక నూతన భవనము కట్టించి ఇచ్చినందులకు శ్రీ శ్రీ బొబ్బిలి మహారాజా వారికి, దివాన్ సాహెబుగారికి, బొబ్బిలి ప్రజలకు ధన్యవాదములు అర్పింపబడెను. విద్యార్థినులందరు లేడీ డాక్టరు గారితో వైద్యశాలలోనికి జై, జై నినాదములతో గృహ ప్రవేశ మొనర్చిరి. మంగళముతో సభ జయప్రదముగా ముగిసెను.

★



★

మా నిర్మలకు

బాష్పాంజలి

★

26-12-46 గురువారము సాయంత్రము 5 గంటలకు ఆంధ్రమహిళాసభా భవనములో నిర్మలాదేవి గ్రంథాలయమునందు శ్రీమతి నిర్మలాదేవి స్మారకసభ సమావేశము జరిగినది. నిర్మలాదేవిగారితో కలిసిమెలసి సభా కార్యకలాపములలో పాల్గొనినవారు, ఆమె ఆప్తమిత్రులు సభకు వచ్చారు. గ్రంథాలయ కార్యదర్శిని నిర్మలాదేవిగారితో మిత్రులైన శ్రీమతి కందా మాణిక్యాంబగారిని అధ్యక్షత వహించమని కోరిన మీదట ప్రార్థన గీతముతో కార్యక్రమము ఆరంభమయినది. నిర్మలాదేవిగారు హాస్టల్ వార్డెనుగా వున్నప్పుడు విద్యార్థినులకు నేర్పిన వందన మే శారదా పాటను విద్యార్థినులు సజలనయనాలతో, వణకే పెదవులతో పాడినారు. శ్రీమతి జెన్నూరి కృష్ణవేణమ్మగారు నిర్మలగారిపట్టుదల, కార్యదీక్ష, సహనములను ఉగ్గడిస్తు జీవితము క్లుప్తముగ వినిపించారు. శ్రీమతి మాడిరాజు రత్నమ్మగారు నిర్మలాదేవిగారి సేవను కొనియాడుతూ వారు ఆమెను ఎల్ల కాలము స్మరించగలిగేట్లు గ్రంథాలయము స్థాపించటము చాల సమంజసముగా వున్నదని అన్నారు. అధ్యక్షులగు శ్రీమతి మాణిక్యాంబగారు సభ ఆరంభదశలో కష్టించి ఎంతో ఉత్సాహముతో ఒడుదుడుకులను ఎదుర్కొన్న మన నిర్మల నేడు యీ సభ ఔన్నత్య దశను చూడలేక పోయినది. కాని యీ సభ ప్రతి కార్యకలాపములోను ఆమె కృషి జీర్ణించి మనము ఆమెను మరువ లేకుండ చేసినది" అని అనిరి. శ్రీమతి అచ్యుతుని గిరిజగారు, శ్రీమతి నిర్మలాదేవిగారు మనకు నేర్పిన కార్యదీక్ష సేవాపరతని మనము మరువరాదు. గ్రంథాలయములోని ప్రతి ఒక్క గ్రంథము సహనము, ప్రయత్నము, సఫలతకు మూలమనే ఆమె సూత్రమును జ్ఞాపకము చేస్తుంది. ఆంధ్రమహిళాసభకు స్వర్గీయ నిర్మలాదేవి పట్లగల గౌరవాభిమానములకు గ్రంథాలయమే సాక్షి అని చెప్పిరి. తమ స్నేహితురాలి జ్ఞాపకార్థము శ్రీమతి కొమ్మూరి పద్మావతీదేవిగారు తిరిగి 15 పుస్తకములను గ్రంథాలయమునకు ఇచ్చిరి. ఆ సమయముననే శ్రీయుత గాలి బాలసుందరరావుగారు ప్రథమ చికిత్స, గృహవైద్యమనే విలువైన గ్రంథమును పంపించిరి. సభ్యులందరును నిర్మలాదేవిగారి ఆత్మ శాంతికి ప్రార్థన చేసిరి. అంతటితో సమావేశము ముగిసినది.

★

ప్రభుత్వ విద్యాశాఖలో స్త్రీలు

"భావి పౌరులను తర్ఫీదు చేసేవారికి
ఉత్సాహజనకమైన పరిస్థితులు కల్పించాలి"

పట్టభద్రులైన స్త్రీ ఉపాధ్యాయినులకు మద్రాసు ప్రభుత్వంవారిచ్చే స్వల్ప జీతాలు-వీరు స్కూళ్లలోను, గృహాల్లోను తమ విధ్యుక్త ధర్మాల్ని సరిగా నిర్వర్తించ డానికి యీ రోజుల్లో యెంతమాత్రం సరిపోవడం లేదు.

స్కూలు అసిస్టెంట్లు యీ చిన్న స్కేలులో పూర్తి జీతాన్ని పొందడానికైనా (ఇంక్రిమెంట్లను గూర్చి యేర్పరుపబడ్డ అనవసర నిబంధనలవల్ల) దుస్సాధ్యమై పోతూ యుంది. పిల్లలకు చదువు చెప్పవలసిన వీరు, వీరిపనికి యెంత మాత్రం సంబంధంలేని ఎకౌంటు బెస్టూ, డిప్యూటీ ఇన్ స్పెక్టరు బెస్టూ పేసుకావాలని నిర్బంధన చేస్తున్నారు. ఎకౌంట్లు చూచే గుమస్తాలూ, ఇన్‌స్పెక్షన్లుచేసే ఇన్‌స్పెక్టర్లూ వీటిని పేసుకావాలంటే ఇంకా కొంత అర్థముంది. అంతే గాని యిది చదువులుచెప్పే ఉపాధ్యాయినుల కెందుకో అర్థం కావడం లేదు.

భావి పౌరుల్ని తర్ఫీదుజేయడానికి రోజూ స్కూల్లో 6-7 గంటలు కృషిచేయవలసిన స్కూలు అసిస్టెంట్లు తమ కాలాన్ని ఇలా ఇతర అనవసరమైనవాటి కోసరం వృథా చేసుకుంటూ నిరుత్సాహులు, జీవితంలో ముందు ఆశలేని వారు, దురదృష్టవంతులుగా తమ్ము పరిగణించుకోవడం దేశానికి ఎంతమాత్రం శుభసూచకం గాదు. దీనివల్ల నిజంగా చాల శోచనీయమైన పర్యవసానా లేర్పడుతున్నాయి. అర్థాకలి, అర్థ బట్టతో జీవచ్ఛవాలులాగ, జీవతంలో నిస్పృహ చెందిన మేష్టర్లక్రింద పాఠాలు నేర్పడానికి పిల్లల్ని ఉంచడం దురదృష్టమనాలో ఏమనాలో తెలియడంలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధ్యాయవృత్తి అంటే, ప్రజల్లో నిరసనభావం యేర్పడిందంటే ఆశ్చర్య మేముంటుంది! వాస్తవంగా చెప్పాలంటే, ఉపాధ్యాయురాలికి సంఘంలోగాని, ఉద్యోగ బృందాల్లోగాని స్థానమే లేదు.

ఈ దుర్భరపరిస్థితులు మన మద్రాసు రాజధానిలోనే. ఇతరరాష్ట్రాల్లో స్త్రీలు యీ దురదృష్ట సోదరీమణులకంటె చాల మంచి పరిస్థితుల్లో నున్నారు. ఉపాధ్యాయినుల వృత్తిలో నున్నవారు విస్తారంగా విధవలు. వీరికి మరే సహాయమూ ఉండదు. పెద్ద కుటుంబాల్ని సంరక్షించుకోవాలి. ప్రభుత్వంవారు కొంచం దయార్ద్రదృష్టితో (భావిపౌరుల్ని తయారుచేసే బాధ్యతగల) ఉపాధ్యాయినులకష్టాలు కొంచం గమనించవలసి యుంది.

దేశంలో స్త్రీ పురుషులు సమాన హక్కులూ, స్వేచ్ఛలూ, ప్రజాసేవకు అవకాశాలూ కలిగియుండాలంటే, స్త్రీలకు హెచ్చువేతనాలు యివ్వడమే గాక, తమకు ఇంత కాలం ఆపబడ్డ ఇంక్రిమెంట్లు యిచ్చి, వాటిని ఏ అడ్డంకులూ లేకుండా పొందుతూ, వీలైనంత హెచ్చుజీతం పొందేటట్లు చేయడం విధియైయుంది. —ఒక విలేఖరి.

★

ఆంధ్ర మహిళ
తెలుగు స్త్రీల ఏకైక పత్రిక
సంవత్సర చందా: అయిదు రూపాయలు
సంపాదకురాలు:
దుర్గాబాయి, యం.ఏ., బి.యల్.
సహాయ సంపాదకులురాలు:
కె. సుగుణమణి
ఆంధ్ర మహిళా సభ
మైలాపూర్ :: మదరాసు.

★

అభ్యర్థన

శ్రీమతి దొప్పలపూడి అనసూయగారు

పావనంబైన మా భారతభూమి
మహితసంపదలిచ్చు మా జన్మభూమి
భక్తినిలయంబైన మా తపోభూమి
కడుసంతతిన్ గన్న కనకంపుభూమి
పరప్రభుత్వముక్రింద పలుపాట్లుబడుచు
కన్నబిడ్డలకెల్ల కడుపారకూడు
పెట్టంగజాలని పేదరాలయ్యె,
మాతల్లిదాస్యంబు బాపంగజేసి
మా సోదరులకృషిన్ ఫలియింపజేసి
మాకు సుఖశాంతులన్ వర్ధిల్లజేసి
ఆకటిబాధచే అలమటించుచును
మృతిబొందువారిని బ్రతికించుదేవ !

★

మా సత్యదీక్షను మరి యాదరించు
మాయహింసాదీక్ష మరి ప్రోత్సహించి
మాలోని నాస్థికత్వము రూపుమాపి
సోదరప్రేమతో క్రోధంబు బాపి
కల్లోలములు మాపి కపటంబు మాపి
సాదరంబుగమాకు స్వాతంత్ర్యమిచ్చి
సమముగాపాలించు ప్రేమస్వరూప !

★

మగువలకు సమముగా మగవారితోడ
సర్వహక్కులుపొందు స్వాతంత్ర్యమిచ్చి
సౌశీల్యబలమిచ్చి సౌభాగ్యమిచ్చి
సతిపతులహృదయంబు లతుకంగగూర్చి
సత్సంతతిన్ బడయు సద్బలంబిచ్చి
సంసారవార్ధిని సంతోషనౌక
యారోహణముతోడ హాయి మీరంగ
తరియింపజేయుము కరుణాంతరంగ !

★

సర్వమానవుల హృత్సరసీరుహముల
ప్రేమమూర్తీ నీవు ప్రియముగానిల్పి
అసురగుణంబుల నసియింపజేసి
దైవగుణంబులన్ స్థాపింపజేసి
నీయందుదృఢభక్తి నిలుపంగజేసి
సర్వేశమమ్ము నీసన్నిధిన్ - జేర్చి
కలుషంబులంటని కరుణజీవితము
కామంబుశోకని ప్రేమజీవితము
ఆనందమయమైన అమృతజీవితము
సర్వేశమాకు ప్రసాదించుమయ్య !

★

అధిక సంతానము

శ్రీ సో. రామచంద్ర అగస్త్యగారు, ఎం. ఏ.

వివాహమైన కొంతకాలమువరకూ స్త్రీ పురుషులు చాల అన్యోన్యంగా ఉంటున్నట్లుగా కనబడతారు. కామ సంతృప్తి అవసరమైనప్పటికీ అతికామము విసర్జనీయమనే విషయం మనము ముఖ్యముగా గమనించాలి. అందుచేత ఈ జీవిత ఘట్టములో దంపతులు కాస్త జాగ్రత్తగా ప్రవర్తించాలి. విషయలోలత్వం ఎంత ఎక్కువైతే దేహారోగ్యం అంతగా తగ్గుతుంది. నిర్ణీత పరిమితిలో ప్రవర్తించుట ఆరోగ్యదాయకము. పరిమితి మించినచో ఏదైనా సరే అనారోగ్యకరమే! ఆఖరుకు అమృతమైనాకూడా అంతే.

వివాహమైన రెండు సంవత్సరములలోపుగా స్త్రీ, సంతానవతి కాకూడదు. అనగా వివాహమైన ఒక సంవత్సరం లోపుగా ఆమె గర్భిణి కాకూడదు. లేకపోతే ఆమె ఆరోగ్యం చెడిపోతుంది. అందువల్ల స్త్రీ శరీరంలో ఉండే కాంతీ, శక్తీ తగ్గుతాయి. ఒక్కొక్కప్పుడు ఇందువల్ల ఆమెకు పురుషునిమీద విముఖతకూడా కలగవచ్చును. అందువల్ల ఈ విషయంలో స్త్రీలకంటె పురుషులే కాస్త ఎక్కువ జాగ్రత్తగా ప్రవర్తించాలి. వివాహమైన రెండు సంవత్సరాలకి వారు తమ ప్రథమ సంతానాన్ని బడయవచ్చును. అందువల్ల ఏవిధమైన హానీ కలగదు. ఇంకా ఎక్కువ కాలానికిగాని మేము తలిదండ్రులముకాము అంటే మరీ మంచిది. అయినా ఇక్కడమాత్రం మనం ఒక సంగతిని గమనించాలి. ఎక్కువ నిగ్రహంవల్లకూడా దేహారోగ్యం చెడుట కలదు. అందువల్ల అనవసరమైన నిగ్రహము ఆరోగ్యదాయకము కానేరదు. ఇక్కడ కొంతమంది ఈ ప్రశ్న వేయవచ్చును. పిల్లలు పుట్టడంకాని పుట్టకపోవడంకాని మన చేతుల్లో ఉన్నదా? జాగ్రత్తగా ప్రవర్తిస్తే మన చేతుల్లోనే ఉంది అంటాను నేను. సంతాన నిరోధకానికి సహజమైన పద్ధతులవల్ల, కొన్ని నిబంధనలవల్ల, కృత్రిమ పరికరములు అవసరం లేకుండానే సాధించవచ్చునని గాంధిజీ అనేకసార్లు హెచ్చరించేరు. చిత్తస్థైర్యమువల్లా, సహనమువల్లా చాలా సులభంగా సాధించవచ్చును.

మొదటిబిడ్డ పుట్టిన ఒక సంవత్సరం లోపుగా మరల స్త్రీ గర్భిణి కాకూడదు. అందువల్ల ఆమె ఆరోగ్యం పూర్తిగా చెడిపోతుంది. తను కోల్పోయిన ఆరోగ్యాన్ని పూర్తిగా ఆమె కోలుకోవాలి. అందుచేత పురుషుడా మెకు పూర్తిగా ఓ సంవత్సరం విశ్రాంతి ఇవ్వవలసినదే. ఆ విషయమై తొందరపడడంవల్ల ప్రయోజనంలేదు. నిగ్రహం కష్టమే. అయినా ఈ కాలంలో ఎంతవరకూ నిగ్రహిస్తే అంతమంచిది. దీనివల్ల మనము గ్రహించవలసిన దేమిటంటే ఒక బిడ్డకీ మరొక బిడ్డకీ వయస్సులో వ్యత్యాసం అథవా రెండు సంవత్సరాలైనా ఉండాలి, ఉండి తీరాలి.

అధిక సంతానంవల్ల ఆరోగ్యం తప్పక చెడి తీరుతుంది. ముప్ఫై అయిదూ నలభైఏళ్ళు దాటక పూర్వమే పురుషుడూ, పాతికేళ్లుదాటక పూర్వమే స్త్రీ ముసలివాళ్లలాగ కనబడడానికి ముఖ్య కారణం ఇదే. ఆరోగ్య విషయమునందే కాదు ఆర్థికవిషయమునందుకూడా మనము దీనివల్ల కలిగే నష్టాన్ని గుర్తించాలి. మన సంతానానికి తగినట్లుగా ప్రభుత్వముకాని, కంపెనీలుగాని, మరే సంస్థలుగాని మన జీవితాన్ని పెంచడం లేదు. రెండు సంవత్సరాలు చెమటూడ్చి పనిచేస్తే మన ప్రభుత్వం మూడురూపాయల ఇంక్రిమెంటు నిస్తుంది! ఈ మూడురూపాయలు ఈ కాలంలో ఎందుకు పనికివస్తాయి? వచ్చేజీతం భార్యాభర్తలకే చాలనప్పుడు ఇక పిల్లలగతి ఏమి కాను? తమ తమ పోషకశక్తినిబట్టి తమ సంతానముయొక్క పరిమితిని నిర్ణయించుకో

“అతి సర్వత్ర వర్జయేత్ ....”

వడం భార్యాభర్తల ముఖ్య కర్తవ్యం. ఈ విషయం చాలా మందికి విడ్డూరంగాను, హాస్యాస్పదంగాను కనబడవచ్చును. మనం పోషించలేనప్పుడు పిల్లల్ని కనడం చాలా తెలివి తక్కువైనపని, అలాగ కనడానికి మనకు హక్కులేదు. భూమిమీదపడిన దాది తాను బాగా పెద్దదైనంతవరకూ పెరిగే హక్కు బిడ్డకున్నది. అటువంటి హక్కు దానికి కలగనియ్యకుండా ఉండడం మహా పాతకం. 'జన్మించి జన్మకు కారకులగుట' అనే సిద్ధాంతము ఏదో ఒకరిద్దరు బిడ్డలవరకే. అంతకుపైగా దానిని అమలులో పెట్టకూడదు. అందుచేత దంపతులు తమ శక్త్యానుసారం పిల్లల్ని కనుక్కోవడం చాలా ఉత్తమమైనపని.

అధిక సంతానంవల్లా, అధికంగా అలవాటైపోవడంవల్లా స్త్రీ పురుషులికి ఒకరిపై ఒకరికి విరాగం కలుగుతుంది. అందువల్ల స్వేచ్ఛగా, అనగా అడ్డంకులు లేకుండా, తమ జీవితం సాగిపోడానికి అనువుగా ఉండేలాగ సంతాన పరిమితినిగలిగి, అన్యోన్య ప్రేమను ఎక్కువగా పెంచుకుంటూ గృహచ్ఛిద్రాలు లేకుండా, సంపూర్ణారోగ్యంగల దంపతుల జీవితమే ఆదర్శప్రాయము! వారి గృహమే స్వర్గము!



దృశ్యం :
సింహళ సముద్రతీరం

★

చిత్రకారులు :
శ్రీ భాగేశ్వరశర్మ

ధన్యజీవి

శ్రీమతి సరిపల్లి జ్ఞానాంబగారు

[మహాత్ముల జీవితాలు మరువరానివి. అట్టి మేధావుల జీవితవిశేషాలు చిరస్థాయిగా చరిత్ర నిర్మిస్తూనే వుంటుంది. కాని, సామాన్య మానవజీవితం, ఎంత లోకోపకారపారీణతమై, ఆదర్శప్రాయంగా చరించినా, అది సామాన్యంగానే అంతమవుతుంది. ఇదీ లోకంపోకడ. ఇట్టి గుప్త ధన్యజీవు లెందరు కాలగర్భంలో విలీనమైపోయారో! అట్టి ధన్యజీవుల్లో నరసమాంబగా రొకరు! ఆంధ్ర మహిళా లోకం మాత్రం నే డొక్కసారియైనా ఆమెను స్మరిస్తుందని నా విశ్వాసం :—]

శ్రీ సోమనాథ శాస్త్రిగారి వాసస్థలం విశాఖ మండలంలోని 'ఆలమంద.' దీనినే యిప్పుడు అలమండగా వ్యవహరిస్తున్నారు. శాస్త్రిగార్ని గూర్చి ఆ రోజుల్లో తెలియనివారు అరుదు.

నరసమాంబ శాస్త్రిగారి ద్వితీయ సంతానము. మాతాపిత లీమె నత్యంత గారాబమున బెంచి, పెద్దచేసి, విద్యాబుద్ధులు గరిపారు. విద్యా పరిజ్ఞాన మధికమయినకొలదియు, విద్వద్వరేణ్యులగు నీపె జనకు లపరిమితాహ్లాద మొంది, పురాణేతిహాసములగు యుద్గ్రంథములను, అత్యుత్సాహమున బోధించుచు జదివించిరి. సంతత దైవభక్తి పారంగతయయిన యీ లలనామణి తొలుత చిన్నచిన్న పద్యములను రచించియు, గేయము లల్లియు, పిదప కృతులను, స్తోత్రములను గావించియు, "రత్న కాంతి సానపొందిననే సహజశోభతో ప్రకాశించునటు"ల నిర్మలమును, కర్ణానందమునగు కవిత జెప్పి, అసమాన ప్రజ్ఞాధురీణయైన తన కవితాచాతుర్యమును మరింత వృద్ధిపరుచుకొనుచు వన్నె గాంచెను.

నరసమాంబకు యుక్తవయస్సు రాగానే, శాస్త్రి దంపతులు, ఆమె నతి గారాబమున పెంచుటంజేసి, అన్న వస్త్రాదులకు లోటులేని శ్రీ నరసింహం పంతులుగారి కొసగి అత్యంత వైభవముగ వివాహ మొనర్చిరి.

శ్రీ నరసింహం పంతులుగారును అతిత్వరలోనే తహశ్శీలుదారు పదవి సంపాదించిరి. కొలదికాలముననే వారికి క్షీరగిరి బదలీ ఆయెను. నరసమాంబ సమేతముగ నరశింహం పంతులుగారు అచటకు వెడలిరి. నరసమాంబ అతిశయము వహింపక, ధన, పద, గౌరవ విచక్షణలేక, తన్ను గాంచ వచ్చిన యింతుల నెంతయో మన్నించి, ముచ్చటించుచు, అన్నాతురుల కభయమిచ్చుచు, గృహ విహీనుల కాశ్రయ మిచ్చి పోషింపుచు, అనతికాలములో సర్వుల ఆదర అభిమాన గౌరవములకు పాత్రురా లయ్యెను.

ఎల్లరు నామెను "నరసమాంబ తల్లీ!" యని బిలచుచుండిరి. నరసమాంబ దైవభక్తికూడ అపారమయినది. అందు గూర్చి అనేక కథలు చెప్పబడుచున్నవి. వానినిగూర్చి లోకము విశ్వసించినను, లేకున్నను ఆమె వినిర్మల దైవచింతకును, పవిత్రజీవితమునకు అవి ముఖ్య నిదర్శనములని మాత్రము ఒప్పుకొనక తప్పదు.

నాడు ముక్కోటి యేకాదశి. తోడి వనితామణులతో ఆలయము ప్రవేశించి, నరసమాంబ యేకాగ్రచిత్తతతో క్షీరగిరీశ్వరుని సేవించి, కొంతవడి స్తోత్రముల గావించెను. పరమేష్టి సందర్శన భాగ్యము వీడలేకవీడుచు, "ఆహా! రేపటి ఉదయమున ఆ కైలాసవాసుడు, ద్వాదశి పారాయణకు తన యింటి కతిథిగా వచ్చి విందుగుడిచిన౯ డెందమెంత యానందముగ నుండునో గద—" యనుకొనుచు గృహోన్ముఖి యయ్యెను.

తెల్లవారెను. కుంభవృష్టిని వర్షము గురియుచుండెను. ఆ సమయమున నొక శత వృద్ధుడు, రుద్రాక్షమాలా లంకృతుడై, కేల నొక పెద్ద చేగఱ్ఱబూని, నరసమాంబ గృహ

ద్వారమును దృఢముగ దట్టుచు, కేకలిడ మొదలిడెను. అంత సేవకాగణములు లేచి, ద్వారము తెరచి, వృద్ధుని అదమాయించుతరి, నరసమాంబ దవ్వుల వీక్షించి, చటాలున వెడలి, వారిని వారించుచు, 'క్షమించుడని' వృద్ధునికి మ్రొక్కులిడి లోన నాతని ప్రవేశపెట్టెను.

ఆ జడవృద్ధుడును ఆయాసమున 'ఆకలి! ఆకలి!' అని నిట్టూర్పుచు చతికిలబడెను. నరసమాంబయు 'క్షణ మోపిక పట్టు'డని యా జడధారి నూరడించి, వడివడి లోనికింజనిపోయి వెలిగించి, అతి త్వరితగతిని స్వహస్తములతో వంట చేయుచుండెను.

అంతలో నామె యనుంగు సోదరునికి జ్వరము విశేషముగ తగిలి, పిక్కటిల్లి, యాకస్మికముగ సంధించి చలువలు గ్రమ్మెను. నరసమాంబ జననీజనకులు, బాలకుని మంచము దరి విలవిల వాపోవుచుండిరి. వైద్యులును, బాలునిచేయి చూచి, నాడి పరిశీలించి, పెదవి విరచి, నిస్పృహులై "ప్రాణము గతించెనని" మందముగ వెనుకకు మరలిరి. త్రుటిలో చావడియంతయు రోదనధ్వనులు మిన్నుముట్టెను.

ఇంత నింట ప్రియపరిచారిక వడివడి వంటయింట కరిగి, సోదరుని మరణవార్త నెమ్మదిగ నరసమాంబ చెవిని వైచెను. కాని యామె చలింపనైనను, చలించలేదు. సురవరగిరివలె ధైర్యచేతస్కయై, నిశ్చలమనస్సుతో "సరే! నే వచ్చి కడసారిచూపు చూచువరకు మృతదేహము మాత్రము వైదొలగింపవలదని చెప్పు" మని యానతిచ్చెను. పరిచారిక మరలిపోయెను.

వెంటనే వంట పూర్తియగుటం చేసి, యామె వృద్ధపాలుని భుజింపలెమ్మని ప్రార్థించెను. ఆ ముసలి బాపడును మందహాసము నొందుచు, కుంటుచులేచి, వంటయింట వడ్డించిన విస్తరముంగిట చతికిలబడి, నెమ్మదిగ యిష్టాన్నముల సంప్రీతిని భుజించుచు, వంటకముల శ్లాఘించుచు, 'ఆ యింట కలవర మేమని' నిర్మలముగ యేమియు నెరుగనివానివలె ప్రశ్నించెను.

నరసమాంబయు, మోమున నెట్టిశోకమును దోపనీయక, దృఢచిత్తయై అకుంఠిత ధీరతతో "సోదరుడు విగతజీవుడయ్యె"నని బల్కెను. బ్రాహ్మణు డాశ్చర్యముగ "ఆఁ! నీ విచటనే యుంటివా! ఎంత పని జరిగినది."

"భగవత్స్వరూపులగు తమ క్షుధార్తి నివారింపక ముందు—"

"అయ్యో! భోజనమంతయు మైలపడినదే. ముందేల చెప్పవైతివి?"

"దేవా! తమ భోజనపు యేర్పాట్లు ముగిసిన వెనుకనే యీ సంఘటన సంభవించినది."

"అప్పుడైనను చెప్పకపోతివా? అంతయు భగ్నమైనది. అపవిత్రత—"

"ద్విజోత్తమా! క్షుధానలముచే బాధనొందుచు, ప్రవర్షముల దడిసి, అతిథులైన తమకుముందు సేవలుచేసి, తమను ప్రీతులచేసి, పిదప యే కార్యమైనను చేయవచ్చును. ఈ విషాదసంఘటన ఆకస్మికముగ జరిగినది. ఇం దపవిత్రత యెంతమాత్రము దోపదు. తాము సంకోచింప నవసరములేదు. క్షమింపుడు తప్పిదమున్న"—అని నరసమాంబ వేడుకొనెను.

"సాధ్వీ! నీ భక్తి అపారము. సంపూర్ణ కరుణామయుడు సర్వేశ్వరుడు. భయము నొందకు. రా!" అనుచు నా వృద్ధ భూసురుడు లేచి, చేయి కడుగుకొని, నరసమాంబను వెంటనిడుకుని, సావడిలో మృతుడై పడియున్న బాలకుని చేరెను. నిమిషములో నాతని మొలలో గుప్తపరచిన భూతిఁగొంతము, మృతబాలుని పెదవులమధ్య వైచి, కొంచెము జలముల జల్లి, "మీ రంద రిడముగ నుండుడు! నేను మరలివచ్చెద, ఘడియలో—" ననుచు వాకిటిలో మూల జేరవైచిన నిడుపు చేగఱ్ఱ కేలబూని వీధిలోనికి నడచెను.

క్షణములో దృశ్యమంతయు ఆనంద సందోహావృత్తమయ్యెను. మృతుడైన బాలుడు తెప్పిరిల్లి, నిద్రనుంచి మేల్గాంచినటుల కిలకిల నవ్వుచు, ఎల్లరకు ముదముగూర్చెను.

తహశ్శీలుదారు గారి పనుపున బంట్రోతులు ఆ ముసలి బ్రాహ్మణునకై నగరమంతయు గాలించిరి. కాని అత డెట్లు అదృశ్యుడాయెనో!!

నరసమాంబ మాత్రము, భక్తవశంకరుండైన శంకరుండే కపట బ్రాహ్మణ వేషధారియై తన కోర్కె సఫలీకృతము చేయునని తెల్పి, తన్ను పరీక్షింపవలెనని నమ్మి, సునిశ్చల గాఢభక్తి తత్పరయై "గోపతే, గౌరీశ కుంజరా సురచర్మ ధారణా!"... అనే గీత మాలికచే నా శుధార నా సుధాకర బింబధాగిని స్తుతించి అలంకరించెను. ఈమె వినిర్మల భక్తింగూర్చి యింకనూ పెక్కు ముచ్చటలు గలవు. యీమె రచన లనేకము లముద్రితములైనను, యీ ప్రాంతములో విహంగముల నోట విన్పబడి నేటికిని నారీలోకమున విహరించుచున్నవి.

అల్ప వయస్కయయ్యు మహోత్కృష్టమును, పరోపకార పారీణమైన జీవితమును గడపి, మానవతీలోకమునకు ఆదర్శప్రాయముగ సంచరించి, నిరాడంబరియై, తన యిరువది నాల్గవ యేట నరసమాంబ, తన భౌతిక దేహమును విశ్వమానవ ప్రపంచమును విడచి, క్షీరగిరీశునిలో లీనమయ్యెను!!

భావిసంఘములో స్త్రీలస్థానము

శ్రీమతి పద్మావతి శ్రీరామ్‌గారు

సంఘములోని వ్యక్తులు వారి వారి అభిలాషలను సంఘపు శ్రేయస్సుకొరకై అరికట్టవలయును. అటులనే సంఘములోని పలుకక్షులవారు కలసిమెలసి యితరుల అనుకూలమును ప్రతికూలమును గుర్తించి వర్తింపవలయును. ఒక పక్షపువారియొక్క జీవితము యితర పక్షములవారి జీవనముపై ఆధారపడక యుండజాలదు. సంఘమును విడదీసి వేర్వేరు శాఖలుగా భావించి ఒక శాఖయొక్క జీవితము, జీవిత సూత్రములు వేరు శాఖలను ఏ విధముగానైన బాధింపకనుట సత్యదూరము.

ఇప్పటి సంఘ స్థితిలో ఈ సూత్రమును గమనించనందున సంఘములోని పలుశాఖలకు తీవ్రమైన భేదాభిప్రాయములు కలతలు మనస్పర్థలు కలుగుచున్నవి. సంఘములో ఏలాటి భేదాభిప్రాయములు లేక ఒక ఆశయముతో యుండుటత్యవసరము. ప్రస్తుత సంఘములో స్త్రీలకు హక్కులు లేమి, చిక్కుల మూలమున సంఘముయొక్క క్షేమము వెనుక జిక్కియున్నది. అసంఖ్యాకములైన యిబ్బందులు వారికి సంఘము కల్గించియున్నది. ఆచారములు, అర్థములేని వ్యర్థమైన నిర్ణయములు వారికి మెడలోని రోటివలె భారమై ముందంజవేయనీయక క్రుంగదీయుచున్నది. స్త్రీల సమస్య కేవలము స్త్రీలోకమునకేగాక మానవ సంఘమంతకును సంబంధించిన విషయము. ఇది ప్రస్తుత ప్రపంచస్థితి. మనదేశములోని స్త్రీ సంఘ సమస్య వేరు. పూర్వకాలములో సంఘము నిలకడగాయుండి, స్త్రీలకు స్వాతంతమును ప్రసాదించినది. ఈ యంత్రయుగమున ప్రాచీన పద్ధతులు తారుమారైనవి, యంత్రములు రాక పూర్వము గృహ ఆవశ్యకములు, సంఘ ఆవశ్యకములని వేరు వేరు విభాగములు లేవు. ఒక్కొక్క కుటుంబమువారు వారి కవసరమైనవాటిని వారి పరిశ్రమచే సేకరించుచుండిరి.

సంఘము చిన్న చిన్న సమూహములుగ విభజింపబడి, సమూహములు, సంఘ అవసరములను తీర్చుచుండెను. స్త్రీలు చేయవలసిన విధులివియని పురుషుల విధులివియని నిర్ణయములేదు. సమిష్టి జీవితములో సంఘావసరములను కొదవలేక తీర్చుకొనుచు జీవయాత్రను నడుపుచుండిరి. గృహ పరిశ్రమలయందు, పొలములో వ్యవసాయ కృషియందు స్త్రీ, పురుషభేదములేక అన్ని పనులను చేయుచు సంఘపు శ్రేయస్సునే ప్రథమ కర్తవ్యముగా గమనించుచుండిరి.

యంత్రములు సంఘములో ప్రవేశించినది మొదలు ప్రతి విషయము భోజనోత్పత్తి, భోజనపదార్థ సమృద్ధి, వాటి మీదనే ఆధారపడ మొదలిడినవి. సంఘ విచ్ఛిన్నమేర్పడి సంసారపు తడసాట్లు సంభవించినవి. స్త్రీలు తమ శిశువులను పోషించుట లెక్కచేయక, కర్మాగారములలో పగలంతయు, శ్రమజేయవలసి వచ్చినది. స్త్రీలకు ఇక్కడినుంచి సంక్రమించినది. గృహకార్యములు వేరు. జీవన సంపాదనకై కృషి వేరు. స్త్రీ గృహధర్మములను నిర్వర్తించుచు, గృహ పరిచర్యయే గమనించవలసినదనియు నిర్ణయింపదొడగిరి. ఆర్థికముగా గృహపరిశ్రమ విలువ తగ్గినది. స్త్రీకి సంఘమునందు వ్యక్తిత్వము క్షీణించినది. స్త్రీ గృహమునందు నిర్వర్తించు కార్యములను రూ. అ. పైసలలో అంచనా వేయుటకు వీలులేదు, దానివల్ల స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యము నశించినది. గృహిణి తననైపుణ్యము ఓర్పు శ్రమను తాను దినదినము జేయు కార్యములలో చూపెట్టుచున్నది. నాణె రూపముగా మాత్రము ప్రతిక్రియ ముట్టదు. ఆమె హక్కులు పరిగణింపబడవు. దీని ననుసరించియే కాబోలు స్త్రీలు పురుషునిపై ఆధారపడుదురను నమ్మకము నానాటికిని నాటుకొనిపోయినది. సంఘములో స్త్రీని లోకువగజూచుటకును యిదియే కారణము. పరిశ్రమలో స్త్రీలకు తక్కువ కూలీల నిచ్చుటయు సంభవించుచున్నది. ఈ స్థితికి కారణము స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యము లేకపోవుటయే.

స్త్రీలకు సంఘములో తగిన ప్రాముఖ్యత నివ్వవలయును. సంఘ క్షేమమునకే ఆమె అత్యవసరము. స్త్రీ కళానిధి, సంఘమును తదేక దీక్షతో రక్షించునది. భావి సంఘ నిర్మాణములో స్త్రీలకు పురుషులతో సమానముగ ఆర్థిక స్వాతం

త్ర్యముండవలయును. ఏ ఉద్యోగమునకైనను స్త్రీయొక్క అర్హతను గమనింపవలయును. స్త్రీయను మిషచే ఆంక్షలు పెట్టరాదు. ప్రస్తుత సంఘములో అవిభాగ కుటుంబముల సంఖ్య స్వల్పము. వేరువేరుగ వారి బ్రతుకు తెరవుకై చెదరిపోవుచున్నారు. ప్రస్తుతపు యువతులు పాఠశాలలనుండి, కళాశాలలను వదలినతోడనే సంసారమును నడుపుట తటస్థించుచున్నది. ఇప్పటి విద్యావిధానము వారికి సంసారమును నడుపుటకనవసరమైనవాటిని నేర్పుచున్నది. గృహశాస్త్రము, శిశుపోషణ వారికి నేర్పవలయును. రష్యాలోవలె గృహిణులకు సంసారమును నడుపుటయందు ప్రభుత్వము సహాయపడవలయును. కుటుంబ అలవెన్సులు, పిల్లల బోనసులు సంఘములో సర్వసాధారణముగాయుండవలయును. ఇంతియేగాక ప్రతియూరను శిశురక్షణ గృహములు, కిండర్ గార్టెన్ స్కూళ్లు అత్యవసరము. అందువల్ల బిడ్డల - తల్లులు ఉద్యోగములకు పోవుటకుగాని, యంత్రశాలలలో పనిచేయుటకుగాని వీలగును; తల్లులకు విరామము బిడ్డలకు క్రమశిక్షణ కలుగును.

పురుషుడు చేయగల ప్రతికార్యమును స్త్రీ చేయగలదని ప్రపంచ యుద్ధములో తేలినది. అమెరికాలో గృహశాస్త్రము, శిశుపోషణ, విషయములను అభిమాన పాఠ్యముగ యువతులు చదువుచున్నారు. స్త్రీలకు ఇంగువగాల ముగా పురుషులు సహాయము చేయుచున్నారు. ప్రస్తుత విద్యావిధానము పురుషుల అవసరములననుసరించి యేర్పరచబడినది. ఇప్పటి పాఠశాలలలోని సహవిద్య సమాన విద్యావిధానముగాదు. పురుషునికై నిర్ణీతమైన విద్యావిధానమున స్త్రీలనుగూడ తయారు చేయడము. విద్య జీవితమునకే గాదు. జీవితమును పావనము జేయుటకు. స్త్రీ ఉపాధ్యాయినులను అన్నితరగతులలోను నియమింపవలయును. ఉన్నతవిద్య గరపు కళాశాలలలోను విశ్వవిద్యాలయములలోను స్త్రీలకు ప్రవేశముండి పురుషులతో సమానమైన ఉద్యోగములను పొందుటకు వసతులేర్పడవలయును. స్త్రీ తనయింటినే కాచుకొని యింటిపనులను తప్ప మరి యే విషయములోను జోక్యము పుచ్చుకొనక యుండు రోజులు కావివి. సంఘశ్రేయమునకు సంఘాభివృద్ధికివలసిన విషయములన్నిటిలోను స్త్రీలు అవసరము. సంఘములోని దుర్నీతివల్ల స్త్రీలను తీవ్ర చట్టములకు గురిచేయుచున్నారు. పురుషునికి సంఘము చూపు చనువు స్త్రీకిని చూపవలయుననిగాదు. స్త్రీలకును సంఘములో గౌరవమైన స్థానమును ఒసంగవలయును.

★

దీపావళి కథ

...బావ యీ సంభాషణ విన్నాడు. అక్కను పిలిచి, "పాపం, కాంతమ్మగారు బియ్యం బదులు కోసం వస్తే, మీ అమ్మ లేదని చెబుతున్నదే, చూసి వీలయితే బియ్యం ఇప్పించు" అన్నాడు.

"మీకు పులిహోర యిష్టమని అమ్మ పులిహోర చేద్దామనుకొంటున్నది. అందుచేత నిజంగానే బియ్యం చాలవు" అన్నది అక్క.

"సామెత చెప్పినట్టుంది. వాళ్లు అన్నం తినటం కన్న మనం పులిహోర తినటం ముఖ్యమా? పులిహోర మానేసి ఆవిడకి కాసిని బియ్యం ఇయ్యమను" అన్నాడు బావ.

...మధ్యాహ్నం ఒంటిగంట వేళప్పుడు కాంతమ్మగారి రెండో కొడుకు వచ్చి, "మా అమ్మ కాస్త యింగువ పెట్టించుకురమ్మంది" అన్నాడు.


అమ్మ వాణ్ని వంటింటోకి పిలిచి ఇంగువ యిస్తూ, "ఇవాళ మీ ఇంట్లో పిండివంటలేమిట్రా?" అని అడిగింది.

"గారెలూ, ఆవడలూ, పులిహోరా!" అని కేక పెట్టి కాంతమ్మ కొడుకు ఇంగువ తీసుకొని పరిగెత్తాడు.


"చూశారా? మనం పులిహోర మానుకుని వాళ్లకి బియ్యమిస్తే వాళ్లు హాయిగా పులిహోర చేసుకున్నారు" అన్నది అక్క బావతో.

"అభ్యుదయ"లో కొడవటిగంటి కుటుంబరావుగారు

★




ఆంధ్రజాతికి జీవంపోసిన నాగేశ్వరరాయలు గతించినా
ఆంధ్రావనిలో ఆ జ్యోతి ప్రజ్వరిల్లుతోనే వుంది



— దేశోద్ధారక శిశుసంరక్షణాలయము —

డాక్టరు అవధాని, కార్యదర్శిని శేషమ్మ, కార్యనిర్వాహకులు మైత్రి,
కోటేశ్వరమ్మ, సరోజిని, సంరక్షణ పొందుచున్న శిశువులు, వారి తల్లులు


ప్రారంభోత్సవమునకేతెంచిన
అమాత్యులు, శ్రీ జగజీవనరామ్, కూర్మయ్య,
పూర్వామాత్యుడు మునుస్వామిపిళ్లై,
మా సభ పూర్వ కార్యదర్శిని దుర్గాబాయి



Ananda Press, Madras.

మాలవెంకికి...

రచన : : : వనమాలి



మాలచ్చిమీ తల్లీ నేనేం పాపం చేశానని నిన్ను సూడకూడదు ? జేమ్మల్లే నిన్ను సూడాలాని మాల సూపకూడదు సరిగందా గుడికాడకేనా బోకూడదూ ? సుందరమ్మా ! ఇలాగని నువ్వు సెప్పావా యీ జేమ్మల్ల కాపడి లేకపోతే యివన్నీ అళ్లపన్నాగాలా ? సెప్పమ్మా ! ఇమ్మ్యాల యెండికవసంలో నిన్ను సూడందే యింటికి పోను. నిజంగా నువ్వు రాసియ్యొద్దంటే యీడ్నే సత్తా ! నన్ను కన్నా తల్లే నన్నుసృంటంటే యిక నే నెందుకు బతకాలా ? అంటూ త్రిపురసుందరి ఆలయమున కెదురుగా కొంచెము దూరములో కూచుని యేడుస్తోంది వెంకి.

అది విజయదశవారము. అంత క్రితం రోజున మహిషాసుర మర్దనిగా వుగ్రరూపాన్ని చూపిన దేవి వెండి కవచంలో మలమల మెరుస్తూ మూర్తీభవించిన శాంతమోయన భక్త జన హృదయాహ్లాదినిగానుండెను. అగ్రజాతి స్త్రీలు ముఖ్యముగా వైశ్య స్త్రీలు రకరకముల పట్టు చీరలను, విలువలేని యాభరణములను ధరించి ఫలపుష్పాదికముల వెండి పళ్లెరములలో నిడుకొని తండోపతండములుగా దేవి యాలయమునకు బోవుచుండిరి.

దేవి దర్శనమందరికీ సులభముగా నగుటకై బాలభటులు జనులను జట్లుజట్లుగాలోనికి పంపుచుండిరి. బయట నున్న వారు లోనివారు తిరిగి వచ్చువఱకును లోకాభిరామాయణములో కాలక్షేపము చేయుచుండిరి. నగలు జాగ్రత్తయని పెద్దలు పిన్నలను హెచ్చరించుచుండిరి. కొంత మంది భక్తులు పాటలు పాడుచుండిరి. కాలక్షేపమునకై వచ్చిన విద్యార్థులు దేవికి ఫలదక్షిణ లిచ్చి నమస్కరించే వారి పిచ్చిని చూచి నవ్వుచుండిరి ! త్రిపురసుందర్ని చూడాలని బలమైన కోరిక వున్నా, గుడి ద్వారం వద్దకైనా పోవడానికి ధైర్యం చాలక, అలంకృతమైన దేవి

త్రిపురసుందరి సాక్షాత్కరించింది

రూపాన్ని వూహించుకుంటూ, ఆలయము వంక ఆపోనని దృష్టులను నిగిడ్చి వెంకి నా సందట్లో యెవరూ చూడలేదు.

రాత్రి యేడుగంటలైంది. భక్తుల రాక మరీ యెక్కువైంది. వెంకి హఠాత్తుగా లేచి నిల్చుని నాలుగడుగులు ముందుకు వేసింది. కాని కాలింక ముందుకు పోలేదు. 5 గంటల వేళ గుడి గుమ్మం దగ్గర పూజారి అన్నమాటలు జ్ఞాపకమొచ్చాయి. "అం..........ట.....రా.....ని.... జా.....తి" గొణుక్కుంది వెంకి. ఒక్క నిమషమూరుకుంది. ఏం నిశ్చయించుకుందో గబగబా నడిచి సింహద్వారాన్ని చేరుకుంది.

ఎవరదీ? మాట్లాడవేం? ఎలాచూస్తుందో చూడు! అయ్యో! అయ్యో! కొంపమునిగి పోయింది! మాల వెంకి! ఏం పొయ్యేకాలమే యిలావస్తున్నావూ? కళ్లు కనపట్టం లేట్టే ముందే ముందోను? కలికాలం! లేకపోతే మాల దిలా నిర్భయంగా రావడమే! గాంధీ పుట్టి పండంటి దేశాన్ని పాడుజేశాడు! తా చెడ్డ కోతి వనమల్లా చెరిచిందిట! తను మాల పిల్లల్ని పెంచి, మాలపల్లెల్లో తిరగటం చాలక అందర్నీ కుల భ్రష్టుల్ని కమ్మని బోధిస్తాడు! ఈ విధంగా వాగ్వర్షం కురుస్తోంది. క్రమంగా జనమంతా అక్కడ పోగుపడ్డారు. దాన్నెవరూ ముట్టుకో కూడదు కదూ! అంచేత దూరంగా నుంచునే మాట్లాడుతున్నారు. వెంకి మాత్రం తదేకంగా దేవిని ధ్యానిస్తూ స్థాణువులా నుంచుని పోయింది.

ఇంతలో అచ్చటికి వచ్చిన కమల ఈ దృశ్యాన్ని చూచి ఆశ్చర్యపడింది. ఒక్క వుదుటున పోయి వెంకిని యింటికి తీసుకు పోదామనుకుంది. కాని జనాన్ని తప్పించుకు పోవడం సాధ్యం కాలేదు. ఆ ప్రక్కనే వున్న అరుగెక్కి నుంచుని అక్కడి వార్ని సంబోధించింది. మీరెచ్చట నున్నారో, యే ప్రయోజనానికి వచ్చారో పూర్తిగా మరచి పోతున్నారు. మీ కఠోర సంభాషణలకు గురియైన యీవెంకి మీ సోదరి యనికూడా మీరుమరచి పోతున్నారు. మన ఏకైక జనకుడు సర్వేశ్వరుడు! అట్టి యెడ మన కీ వేదములేల? వీనివలన మనము పరులకు బానిసలమగుటే కాక పరమేశ్వరునికినీ దూరమగుచున్నాము. మానవునికి ప్రధానమైనవి నీతి, జ్ఞానము, ధర్మదృష్టి, దైవచింత కాని జాతి కాదు. శ్రీరామ చంద్రుని వీర గాథను లోకమున కందించిన మునిపుంగవు డెవరు? పతివ్రతా శిరోమణి అరుంధతి ఎవరు? హిందూమత సూత్రములు విశ్వప్రేమను బోధించుచున్నవే! అట్టి యెడ యీ మీ సంకుచిత దృష్టి కేమి కారణము? భగవద్గీతలో యెచ్చటనైనా అంటరాని తన మున్నట్లు చెప్పబడినదా? చండాలత్వము లేదని కాశీవిశ్వనాథుడు శ్రీ శంకరాచార్యునికి బోధింపలేదా?

విజయలక్ష్మి పండిట్ ప్రభృతు లమెరికాకు పోవుటయు మీ రెరుగరా? మిత్రరాజ్య సమితిలో చేసిన విజయలక్ష్మి వీరగర్జనలు మీరు వినలేదా? ఆఫ్రికాలోని యే పద్ధతిని మనము గర్హించుచున్నామో, యే పద్ధతి మానవ నాగరికతకే వ్యతిరేకమని మన నాయకులు ఘోషించుచున్నారో, దానినే మన సోదరుల

యెడ ప్రయోగించిన మనలను ప్రపంచక మేము నును? పరమేశ్వరుడు హర్షించునా? యోచింపుడు!...."

ఇంతలో అమ్మా! అమ్మా! అంటూ సాష్టాంగంగా పడుకొంది వెంకి. ఇంత సక్కనమ్మకే అంతమాత్తు! నాలుగు సేతులూ నల్లటి రూపూ, కళ్లల్లో వుండాది సిరి మా అమ్మకి! ఆపద్దావమ్మా అంతేసాలు! అంటూ యింటి ముఖం పట్టింది వెంకి!

ఇప్పుడైనా ఆత్మ ప్రధానంగాని కులంప్రధానం కాదని ఒప్పుకుంటారా? బాహ్యనేత్రములతో దేవి విగ్రహాన్ని చూచారంతాను! దేవి దివ్య రూపన్ని వెంకి తన మనో నేత్రంతో చూచింది ధన్య జీవి! కమల అరుగు దిగింది. అచ్చటి వారొకరి ముఖాలొకరు చూచుకొని యెవరంతట వారు దారి తీశారు కమల మాట లెంత మంది హృదయాల్ని కదిల్చేనో మీరు చెప్ప గలరా???

★

★ శీలరక్షణ! ★

శ్రీమతి సుగుణ అగస్త్యగారు

ప్రసాదరావు రాజమండ్రిలో కలక్టరు కచ్చేరిలో ఒక గుమాస్తా. జీతం కొద్ది అయినప్పటికీ, భూవసతుదారులై నందున సంసారము నిరాటంకముగా గడచిపోవుచున్నది. అతని భార్య యశోదమ్మ. పెద్దదైనను చదువుకొన్నది. చాల ఉత్తమురాలు, నిరాడంబరి. వారి సంతానము ముగ్గురు కుమార్తెలు. కుమార్తెలు జానకి, అహల్య, వీణ. పెద్దవారిద్దరు స్కూలుఫైనలువరకు చదివిరి. ఆ పైన వారిరువురకు మంచి సంబంధములను చూచి పెండ్లిచేసెను. జానకిని ఎత్తెత్తి ఎంగిలాకుమీదవేసినట్లు ఒక గోపికాలోలునకు యిచ్చెను. కాని భార్యయందు మాత్రము గాఢానురాగుడు రామమోహనరావు. ఆ వూరిలోనే బ్యాంకులో గుమాస్తా. వారి సంతానము యిరువురు కుమారులు. అహల్య పెనిమిటి జనార్దనరావు. గవర్నమెంటు డాక్టరు. ప్రస్తుతం తిరునల్వేలిజిల్లా ఆసుపత్రిలో పనిచేయుచున్నాడు. సంతానప్రాప్తి యింకను లేదు. చాల బుద్ధిమంతుడు. వీణ యింకను రాజమండ్రి గవర్నమెంటు హైస్కూలులో స్కూలుఫైనలు క్లాసులో చదువుతున్నది. బాల్యమందున్నను, చదువుకొనుచున్నను, యింటివద్ద తల్లికి సహాయముచేయుచూ, మహిళాసభలందతి శ్రద్ధతో పాల్గొనుచూ తలిదండ్రుల కల్లారుముద్దుగ పెరుగుచుండెను. కాని, సంఘముపేర తిరిగెడు పల్లేరుకాయలకు మాత్ర మీ కుటుంబమనిన అసూయ. అవుసరమయినప్పుడు అందరకూ మహానుభావులే వీరు.

జానకీ రామమోహనులు అనుకూల దంపతులేయైనను, రామమోహనుని వైఖరిని చూచి వీణ అసహ్యించుకొనుటయే కాక, వివాహమందే నిరసనభావము చూపించెను. యీ కారణమున రామమోహను యింటికివచ్చినప్పుడు అయిష్టముగా వుండి తరచు సూటీపోటీ మాటలు అతనిపై విసురుతూ వుండుటామె కలవాటు. ఆ కారణమున ఎప్పటికైనను యీమెపై కసితీర్చుకొనవలెనని దీక్ష వహించెను. ఏ విషయమందు వీణపై ఆగ్రహించనితల్లి యీ విషయమందు మాత్ర మామెను మందలించుచుండును. జానకికిగూడ వీణయందసూయభావ మేర్పడెను. ఎంత దుర్మార్గులైనను భర్తను నిందించినవారిపై ఆగ్రహమొందుట భార్యలకు సహజమే కదా. వీణ యౌవనమందుండి అసమాన సౌందర్యరాశియై- పెక్కుమందికి భ్రాంతి కలిగించి గిలిగింతలు పెట్టుచుండెను. జానకికిగూడ తల్లిరూపు రేఖావిలాసములలో భాగముండినను కొద్దిగా వయస్సు మీరియుండుటచేతను, సంతానావస్థచేతయున్నూ వీణకు లొంగె. తన భర్తను వీణ వలపులో వేసుకొనునేమో యను భీతిని కౌగలించుకొనెను. యీ కారణమున అక్కచెల్లెల్లిరువురకు తరచు కలహములు వాటిల్లుచుండెను. కాని ప్రసాదరావు బుద్ధికుశలత, నలోక్తి వారిని సమాధానపరచు చుండెను.

అహల్యా జనార్దనలు వీణను చాల ప్రేమగా చూచుచుందురు. వారిద్దరకు ఏ లోటు లేకున్నను, సంతానహీనులై పలుమంది హేళనకు లోనగుచున్నారు. ఛాయమ్మ ప్రసాదరావుకు చాల దూరపు బంధువు. భర్త దేశాంతరగతుడై పది సంవత్సరములు కావచ్చును. కాని ఆమెకు అటువంటి వ్యసనమేమియు లేకుండా వుల్లాసంగా జీవితం గడుపుచుండెను. ఆ పైన యింటింటికి తిరిగి యిచ్చకపుమాటలాడి తగవులు తెచ్చిపెట్టుటలో ఆరితేరినది. ముఖ్యముగా ప్రసాదరావు గారి కుటుంబమున కీమెను చూచిన పరమాసహ్యం. జానకికి మాత్రం యీమె స్నేహితురాలు. రామమోహను ఎక్కడెక్కడకు వెళ్లెనో, ఎవరెవరితో మాట్లాడెనో యీ సమాచారమంతయూ చెప్పుచుండుటచే చాల మంచిదనియు, తనయెడల సానుభూతి చూపుచున్నదనియు ఆమె యూహ.

వరలక్ష్మీవ్రతం బహు వైభవంగా జరిపి వీణ అందరి మెప్పు వడసెను. ఒక్కవూరిలో వున్నను, అక్కచెల్లెళ్లిద్దరు కలసి చేసుకోవచ్చునని తండ్రి ఎంత చెప్పినను, జానకి వేరే

చేసుకొనెను. పేరింటమునకువచ్చిన ముత్తైదువులందరు వీణను చూచి ఆనందించి, ఆమెను చేసుకొనే వాడెంతటి యదృష్టవంతుడో యని అనుకొనసాగిరి.

ఇట్లే కొన్ని మాసములు గడచెను. పరీక్షలు జరిగెను. వీణ ప్రథమ తరగతియందు ఉత్తీర్ణురాలయ్యెను. తలిదండ్రులు వివాహ ప్రయత్నములు చేయసాగిరి. కాని వీణకు అంత ఉత్సాహముగా లేదు. యింకను చదువు సాగించవలెనని ఆమెయాశ. కాని తల్లిదండ్రుల కెదురు చెప్ప నిష్టపడక వూరకుండెను. ఒకనాటి మధ్యాహ్నము ప్రసాదరావు, యశోదమ్మ వీణ సంబంధవిషయమై పెండ్లివారింటికి వెళ్లిరి. వీణ ఒంటరిగా యింటివద్ద నుండెను. యింతకుముందెన్నిపర్యాయములో ఆమె ఒంటరిగా వుండుట తటస్థించినను- భీతి నొందలేదు. యీ మారెందుకో ఆమె భయపడసాగెను. తన మనస్సు కుదుటపరచుకొనుటకు వీణను తీసి వాయించుకొనసాగెను. కొంతసేపయిన పిమ్మట తలుపు తట్టినట్లు వినబడెను. తలమీద పిడుగుపడినట్లు ఆమె తలుపుతీసి చూచునప్పటికి రామం (రామమోహను) ప్రత్యక్షం.

యిద్దరు పెనుగులాడిరి. వీణ ఎంత పెనుగులాడినా ప్రయోజనము లేకపోయెను. యింత నీచస్వభావుడనియు, తన శీలము భంగపరచుననియూ ఎప్పుడూ అనుకోలేదు. పాపం వీణ వెక్కి వెక్కి ఏడ్చుచుండెను. తన జీవితం అధోగతి పాలయ్యెనని కుమిలిపోవుచుండెను. యీ లోపున యశోదమ్మ యింటికి తిరిగివచ్చెను. కూతురిఅవస్థ చూచి తెల్లబోయెను. ఎంత అడిగిననూ తన విచారమునకు కారణం చెప్పలేదు. బ్రతిమాలగా, బ్రతిమాలగా చివరకు సంగతంతయు చెప్పెను. ప్రసాదరావుకూడ వచ్చి సమాచారమంతయు తెలిసికొనెను.

ప్ర:— హా ! ఎంత ఘోరము. యింతకూ మేమూ పశువులం. నిన్నొంటరిగా విడిచిపెట్టుట మాదే తప్పు.

య:— అయినా నువ్వు అగ్గివంటి దానివి కదా. తగ్గినట్లు బుద్ధి చెప్పలేకపోయినావా—తల్లీ.

వీ:— పై మనిషి అయితే నేను కరచి వదలిపెట్టే దానినే - ముఖంమీద వుమ్మేదానినే - కాని - బావ అసాగ్యుడు. అక్కకు కోపం వస్తుంది. వా డేమి చేసినా, నాదే తప్పంటుంది. యిక నా బ్రతుకేమిగాను ?

య:— వూరుకోమ్మా మేము చూస్తాము లే - నీ తప్పే ముంది. యిది పైకి రాకుండా కాపాడుకోనే బాధ్యత మనది. నువ్వుమాత్రం ధైర్యంవహించు తల్లీ. ఏ మాత్రం మార్పున్నా లోకులు గ్రహిస్తారు.

ప్ర:— ఛీ. దుర్మార్గుడా. నేనే దగ్గరుంటే చంపేవాడినే. వాడికి బుద్ధిలేదూ పెండ్లికాని పిల్లను చెరచటానికి. నా కూతురు ఒక్కర్తె చాలదూ. యిద్దరు కావలెనా. దానికి మన మిప్పు డేమిచేయగలము. ఎవరింటికైనా పంపించినా బాగుండేది. వాడినేం చేసినా పాపంలేదు. మాకే ద్రోహం చేస్తావా - పాపాత్ముడా.

య:— వూరుకోండి యింక. దానిని ఓదార్చండి. తరువాత నెమ్మదిమీద ఆలోచించవచ్చును.

వీ:— ఏ మాలోచిస్తారు. యింత జరిగిన తరువాత నే నెలా పెండ్లిచేసుకొనేది. మీరే ఆలోచించండి. మోసం చేసినట్లు గదా. యీ సంగతి ముందే చెప్పలేము గదా. నేను ట్రెయినింగు చదువుకొని వుద్యోగం చేసుకుంటాను. బాగా ఆలోచించండి.

ప్ర:— మేము అలాగే ఆలోచిస్తాము లే. యిప్పుడు లేచి ముఖము కడుక్కో. ఎలా వాచిందో చూడు ముఖం. లే. ఎవరైనా వస్తారు మళ్లీ.

ఆ రాత్రికి దంపతులిద్దరు బాగా ఆలోచించుకొని, వీణ ఆలోచన బాగుగానే వున్నదని సమాధానపడి - ఏమైనను ఒక సంవత్సరము విశ్రాంతి యిచ్చుటకు ఏర్పరిచిరి. కాని అంత సులభముగా కుదిరిపోవునా - రామమోహను ప్రతిజ్ఞ నెరవేరెనా అనినట్లు - వీణకు తగని అవస్థ సంభవించెను. యీ పరాభవ మెట్లు భరించగలదు. లోకమంతా వ్యాపించదా. నివృత్తి చేయుటకు వీణ అంగీకరించలేదు. ప్రాణహత్య కాదా. మాన మర్యాదలకొరకు ఒక ప్రాణమును తీయుటయేనా. ఏ వుపాయమూ లేకపోయిననాడు- రామం కుచితబుద్ధి వెల్లడిపరచి- పరువును పోగొట్టి- తాను కన్యగా

వుండిపోయి, తన బిడ్డను గౌరవంగా పెంచి పెద్దవానిని చేయ ప్రసాదంపు కొక ఆలోచన తట్టెను. అందుచేత రహస్యముగా అహల్యను, జనార్దనరావును సెలవుమీద రమ్మని వుత్తరము వ్రాయగా, వారిరువురు తక్షణమే బయలుదేరి వచ్చిరి. బహు రహస్యముగా సంభాషణలు జరిగెను. జానకికి గూడ తెలియచేయలేదు. జనార్ధనకూడ చాల దూరాలోచన కలవాడు. తన కింతమట్టుకు సంతతిలేదు. మామగారి ఆలోచన గ్రహించి సంతోషపడెను. అహల్య గర్భిణి అయినట్లు, వివాహానంతరము చిరకాలమునకు వచ్చినందున పెద్ద ఆసుపత్రిలో జరుపుటకునూ, తాను దగ్గరగా వుండుటకునూ, వీలగునట్లు దూరముననున్న సంస్థానపు ఆసుపత్రిలో వుంచుటకునూ, సహాయముకొరకు వీణను తీసుకు వెళ్లునట్లునూ ఏర్పాటు చేసిరి.

జనార్దనరావు వీణను ఎప్పుడూ సంతోషముగా వుంచుటకై అనేక విధముల నవ్వించుతూ, ముగ్గురూ ఆట పాటలతో కాలము గడుపుతూ వచ్చిరి. గర్భము పరిపక్వమై ఒక సుముహూర్తమున ఆడ శిశువు జనించెను. ఆదినుండియు బిడ్డకు పై పాలే గతియైనది. పది రోజులు ఆసుపత్రిలో గడచిన పిమ్మట అందరు యింటికి తిరిగివచ్చిరి. యధావిధిని నెలలోపున నామకరణము జరిగెను. బిడ్డకు "జయంతీ"యను నామంబిడిరి. జనార్దనరావు డాక్టరైనందున, చికిత్స స్వంతముగా గడచెను. జయంతికి తమ స్వంత బిడ్డకంటె ఎక్కువ గారాబముతో పెంచెదరనియూ, ఏ విధమైన లోటు కలుగనీయరనియు, బిడ్డపై వీణ అధికవాత్సల్యము చూపరాదనియు షరతులు వేయబడెను. కాని వీణమాత్రం మాతృప్రేమ నణచుకొనుటయందు చాల దుఃఖపడవలసి వచ్చెను. కన్న బిడ్డలయందు అనురాగము చూపకుండు టెట్లు? భర్తకంటెను బిడ్డ లెక్కువకదా. తనబిడ్డపై తన అక్క, బావ చూపు వాత్సల్యముచూచి ఓర్వలేక పోయేది. కాని ప్రపంచమునకు వెరచి అన్నియు దిగమ్రింగి యధాప్రకారం తిరుగుచుండి ఒక దినము నలుగురు పయనమై రాజమండ్రి వెళ్లిరి. బిడ్డను తాతా అవ్వలకు చూపి తిరిగి అహల్య, జనార్దనులు జయంతీ సమేతముగా తమవూరికి వెళ్లిరి. జానకికి మాత్రం యిదిఅంతయూ పద్మవ్యూహంవలె వుండెను. తన కిద్దరు బిడ్డలు పుట్టిరిగదా. ఎప్పుడూ యింతశ్రద్ధ వహించలేదే. అహల్య పురిటికెందుకు కీహడావుడి. వీణ ఎందుకు వెళ్లవలెను. పుట్టినాటికి రాకూడదా అని అనేకవిధము లాలోచించి యిటీవల తనమీద వ్యామోహము తగ్గినట్లు దురభిప్రాయపడెను. కాని ఏమిచేయగలదు. వీణ ట్రెయినింగు తరగతియందు ప్రవేశించెను. తరుచు మనస్పర్థలతో సంవత్సరము గడచెను. వీణ ట్రెయినింగు పరీక్షయందు తీర్ణురాలై, ఒక వుద్యోగము సంపాదించి రాజమండ్రిలోనే స్వగృహమందుండెను. జయంతికిగూడ సంవత్సరము నిండెను. జయంతి తాతగారింటికి వచ్చి ప్రథమ జన్మదినోత్సవమును మహా వైభవముగా జరిపించుకొనెను. వీణ యిచ్చిన కానుక లిన్నియని చెప్పుటకు వీలుగాదు. మాతృవాత్సల్యము గాదు. ఆడపిల్లలందు వాత్సల్య మెక్కువను మిషతో రోజంతయు జయంతితో గడుపుచుండేది. 'మూడు మూర్తులా పినతల్లి పోలికేనమ్మా'యని యిరుగు పొరుగువారంటూవుంటే, వీణకు వుక్కిరిబిక్కిరిగా వుండేది.


జయంతి గారాబంగా పెరిగి తేనె పలుకులు నేర్చింది. "పిన్నీ నువ్వంటే నాకు చాల యిష్టము. అమ్మకూడ యిష్టమే గాని, నువ్వు యింకా ఎక్కువ"అని అంటూవుంటే వీణ పరవశమయిపోయేది. యిదంతా తనపాపమునకు ప్రాయశ్చిత్త మనుకునేది.

ఆహా-ఏమి ఆ తలిదండ్రుల యోగ్యత. ఓర్పు-ప్రేమ-ఎంత మంది తమ బిడ్డలను ఆ విధంగా రక్షించుచున్నారు? న్యాయాన్యాయములు విచారించుచున్నారు. దూరాలోచనయే వుండుటచేతనే కదా. వీణ సంఘ బహిష్కారము నుండి రక్షింపబడినది. లోకులనిందకు గురికాకుండా జయంతి సాధారణ యువతి కాగలిగినది.

ఇట్టి వెన్నియో లోకంలో జరుగుచుండవచ్చు. పెద్దలు, వీటి మూలకారణముల నారసి, నిర్మూలించుట సంఘమునకు శ్రేయస్కరమని మనవి.

★

విదేశ పానీయాలకై మాల్టు, మాల్టుఫుడ్‌లకై ఏటేటా మన దేశంనుండి లక్షలాది రూపాయలు పారి పోతున్నాయి. దీన్ని ఆపడానికై వ్యవసాయ డైరెక్టరు, రా॥ బ॥ డా. బి. విశ్వనాథం పంతులుగారు, ఎవరి అంతట వారే, తమ యిండ్లలో, జొన్నలు—చోళ్లనుంచి మాల్టు చేసుకొనే విధానాన్ని కనిపెట్టేరు.



ఒకటి రెండు చెమ్చాల మాల్టు, కొంచం చక్కెర, గ్లాసుడు పాలల్లో కలిపి కాఫీ, టీలవలె పుచ్చుకోవచ్చు.

మాల్టు, గోధుమపిండి, వెన్న, కోడిగ్రుడ్లు కలిపి, చక్కటి 'మాల్టు బిస్కట్లు' చేసుకోవచ్చు.

స్త్రీలు చదివే పుస్తకాలు

★ శ్రీమతి యమ్. వెంకటరమణమ్మగారు బి. ఏ., బి. ఇడి. ★

'స్త్రీలు చదివే పుస్తకాలు' అంటే, ప్రత్యేకంగా స్త్రీల కోసమని వ్రాసినవైనా పుస్తకాలున్నాయేమో అనిపిస్తుంది. నిజానికి స్త్రీలు, తమ నిత్యకృత్యంలో తెలిసికోవలసిన విషయాలెన్నో ఉన్నాయి. "ఏం, ఉద్యోగాలు చెయ్యాలా, డిగ్రీలా, ఆఫీసులకి వెళ్ళాలా" అనే రోజులు పోయాయి. ఉద్యోగాన్ని యేలకపోయినా, తన యిల్లు చక్కదిద్దుకోడానికీ, తన సంసారం సౌఖ్యకరంగా చేసుకోడానికి ప్రతి స్త్రీకూడా అనేక విషయాలు తెలిసికోవాలి. మన కవులు చాలామంది, గృహాన్ని ఒక చిన్న రాజ్యంగాను, గృహిణిని ఒక రాణిగాను వర్ణించడం మనం వింటాం. రాజ్య నిర్వహణకు యెంత శక్తిసామర్థ్యాలు కావాలో, గృహ నిర్వహణకూ, అంత నేర్పు ఓర్పులూ కావాలి. అంచేత స్త్రీలుకూడా, తమ జ్ఞానాభివృద్ధికి కావలసిన పుస్తకాలను సంపాదించి, వాని యుపయోగాన్ని పూర్తిగా గుర్తించాలి.

చాలామంది స్త్రీలకు తమ భర్తలు తమ పనులమీదను, పిల్లలు చదువులకు వెళ్ళిపోయిన తరువాత, తిరిగి సాయంకాలము ఆమె పనులకు పోయేవఱకు యెంతో తీరికకాలం ఉంటుంది. కాని యెంతోమంది యీ కాలాన్ని నిరుపయోగమైన వ్యర్థ ప్రసంగాలతోనో, పుక్కిటి పురాణాలతోనో వృథా చేస్తారు. ఇదీ గాకపోతే, కరువుతీరా, నిద్రకు వినియోగిస్తారు. ఏ కొద్దిగానైనా భక్తి భావం కలవారు, యే భారత భాగవతాలనో, లేకపోతే, ఊర్మిళాదేవి నిద్రనో, మరి లక్ష్మణదేవర నవ్వునో యేవోపాటలు పాడుతూ ఉంటారు. వెనుక రోజుల్లో చదువులు యెక్కువగా లేని కారణంచే, యీ విధంగా నోటినే పాటలు నేర్చుకొని జ్ఞాపకం ఉంచుకొని, తీరిక సమయాల్లో పాడుకొనేవారు ఇవి



రచయిత

కేవలం కాలక్షేపానికి, లేదా భక్తి మార్గానికి ప్రోత్సహిస్తాయి. కాని, మనకు రోజూ మన జీవితంలో ఉపయోగించే విషయాలు తెలుసుకోడానికి, యింతకంటె యెక్కువైన, శాస్త్రీయమైన పుస్తకాలు యెన్నో ఉన్నాయి. వాటిని చదివితే, తప్పకుండా యిప్పటికంటే స్త్రీలు యెన్నోవిధాల జ్ఞాన వికాసమంది, తమ సంసారాలని, యెక్కువ సుఖప్రదంగాను, యెక్కువ ఆకర్షవంతంగాను, యెంతో ఆనందదాయికంగాను, ఆదర్శప్రాయంగాను నిర్వహించ గలుగుతారు. నిజానికి, సంసారంలో పురుషునికంటే స్త్రీకే బాధ్యత యెక్కువ. సంసారానికి తగిన సంపాదన చేయడంవఱకే పురుషుని పని. కాని, తెల్లవారింది మొదలు ప్రొద్దుగ్రుంకేవఱకు, స్త్రీయే యింటి యజమానురాలుగా, తల్లిగా, భార్యగా, కోడలుగా, అక్కగా, చెల్లెలుగా యింకా యెన్నో తరహాలుగా, యింట్లో మసలుకోవడం నేర్చుకోవాలి. అతిథి, అభ్యాగతులువస్తే ఆదరించడం నేర్చుకోవాలి. భర్తకు వచ్చే ఆదాయంలో, సంసారం పొందికగా చేసుకోవడం నేర్చుకోవాలి. తన తాహతుకు తగినట్లుగా, గౌరవానికి లోపం లేకుండా, యింటి మర్యాదకు హాని రాకుండా, స్త్రీ నలుగురిలోను మెలగడం నేర్చుకోవాలి. తాను నిర్వహించవలసిన ప్రతిపాత్రను, యెంతో చాకచక్యంతో, అతి సామర్థ్యంగా నిర్వహించాలి. అప్పుడే, ఆమె ఆదర్శ గృహిణి అనిపించుకుంటుంది. దీనికి కొంత లోకానుభవం, కొంత జ్ఞానోపార్జన ఉండి తీరాలి. వీటిని, పుస్తకాలనుండి గ్రహించడానికి వీలుంది. ఈ విధంగా స్త్రీలకు ఉపయోగపడే పుస్తకాలు, స్త్రీలు తప్పకుండా చదవవలసిన పుస్తకాలు, యెన్నో ఉన్నాయి.

ముఖ్యంగా నిత్య జీవితంలో మనం తెలుసుకోవలసిన విషయాలు, కొన్ని

హిందూ సుందరీమణుల చరిత్ర, గ్రామారోగ్య రక్షణ, అంటువ్యాధుల నివారణ

ఉన్నాయి. స్త్రీలు, అత్తవారిళ్లల్లో సంచరించే విధానం, వారు నేర్చుకోవలసిన వినయం, ఓరిమి, శీలం, యివన్నీ చిన్నతనంనుండే అలవడాలి. పతివ్రతల కథలను, మనం వింటాం. ఇటువంటివారిని గురించి తెలిసికోడానికి, రాయసం వెంకటశివుడుగారు వ్రాసిన, "హిందూ సుందరీమణుల చరిత్రములు" అనే పుస్తకం చాల చక్కగా ఉంటుంది. ఇందులో, పూర్వకాలంనుంచి మహాపతివ్రతలని పేరెన్నికగన్న సీత, దమయంతి, సావిత్రి, చంద్రమతి మొదలైనవారి చరిత్రలెంతో ఆదర్శంగా చిత్రింపబడి ఉన్నాయి.

ఈ పతివ్రతా లక్షణాల్ని అలవరచుకొన్నా, స్త్రీలు యింకా యెన్నో విషయాల్ని తెలుసుకోవాలి. మన హిందూదేశం, పల్లెలదేశం అని జ్ఞాపకం ఉంచుకోవాలి. (ప్రస్తుతం మన గ్రామాలుండే స్థితినిచూస్తే. వాటిని బాగుచేసుకొని, గ్రామ సౌభాగ్యాన్ని పొందడం, మాటలతో జరిగే పనికాదు.) ఎంతో వెనకపడివున్న పల్లెలలో, ముందు విద్య నేర్పాలి. తరువాత, ఆరోగ్యవిధులు అంటువ్యాధుల నివారణ, శుచి, శుభ్రత, గ్రామారోగ్య రక్షణ యివన్నీకూడా తెలిసి ఉండాలి. వీటన్నిటికితోడు, ముఖ్యంగా స్త్రీలకు ఆహార విజ్ఞానం, ఆరోగ్య సంరక్షణ, శిశుపోషణ, ప్రసవము మొదలగు విషయాలు తెలియాలి. ఈ ప్రతి విషయంపైనకూడా, యెంతో తెలిసిన విజ్ఞానవేత్తలు చక్కని పుస్తకాలు వ్రాశారు. అవి ప్రతి స్త్రీ కూడ చదువతగ్గవి, చదువవలసినవే.

ప్రతి మానవునకు ఆరోగ్యం అత్యవసరం. ఆరోగ్యమే మహా భాగ్యమంటారు. శరీరం స్వస్థతగా ఉన్నన్నాళ్లు, మనకు, ఆరోగ్యం అంటే అంత శ్రద్ధ ఉండదు. కాని, అనారోగ్యంనుంచి కలిగే కష్టనష్టాలను మనం స్పష్టంగా గుర్తించిననాడు, ఆరోగ్య భాగ్యాన్ని అంత నిర్లక్ష్యంగా చూడం. దీన్నిగురించి మనం సాంతంగా చదవడానికి, గుళ్లపల్లి నారాయణమూర్తిగారు వ్రాసిన "గ్రామారోగ్య రక్షణ" అనే పుస్తకం, చాలా సహాయంగా ఉంటుంది. ఈ ఆరోగ్యరక్షణ సదుపాయాల్ని అనుసరించడానికి, రోగాలను నివారించడానికి, తగిన శక్తిలేకయే యెంతోమంది, బలి అవుతున్నారు. ఈ పుస్తకంలో, అనారోగ్యానికి కారణాలేమో, వాటి నివారణ యెట్లో, నిర్మూలమెట్లో అన్నీ సులభంగా, యెంతో యింపుగా వ్రాశారు. మన గ్రామాల్లో, గాలిలేని యే చుట్టు గుడిసెలలోనే ఉండి, పొలాల యెరువుకని, దొడ్డిలోనే, పెద్ద గోతులను త్రవ్వి, పెంట కుప్పలను పెంచడంవలన కలిగే రోగాలను, నష్టాలను గుర్తించి, తమ యిండ్లను, యింటి చుట్టుపట్లను శుభ్రంగా ఉంచడం, ప్రతివారు నేర్చుకోవాలి. ఇట్లు ప్రతియిల్లు శుభ్రపడిననాడు, ఆ ఊరు అదే శుభ్రమౌతుంది. ఈ విషయంలో "అంటువ్యాధుల నివారణ" అనే పుస్తకం (డాక్టర్ మరంగంటి శేషాచార్యులు, డాక్టర్ కుప్పా వెంకటరామశాస్త్రి)కూడా చదువతగినదే, ఇందులో యీ వ్యాధుల లక్షణాలు, వ్యాధుల కారణాలు వాటి నిరోధం, యివన్నీ విపులంగా ఉన్నాయి. ఈ విజ్ఞానం, ప్రతిచోట వ్యాపించి స్త్రీలు, పురుషులూకూడా, మెలకువగలిగి ప్రవర్తిస్తే, గ్రామ ఆరోగ్యం త్వరగా చేకూరుతుంది. కనుక, యీ విషయాల్ని ప్రతివారు చదువవలసినవే.

ఇల్లు అలకగానే పండగకాదన్నట్టు, యింటి శుభ్రత నేర్చుకోగానే స్త్రీ బాధ్యత పూర్తికాలేదు. ఇంటిల్లిపాదికి ఆమె అన్నపూర్ణ. ఎవరెవరికి యే రుచులు కావాలో, యే వేళలలో యేమి యివ్వాలో, యేవిధంగా ఆహారపోషణ చెయ్యాలో ఆమెకు తెలియాలి. ఆవేళకింత ఆకలి చల్లారడానికి యేదో తింటే చాలదా, బ్రతుకంతా వంటతోనే గడపాలా అని, ఆహార విషయంలో అశ్రద్ధచేసి, ఉడికి ఉడకని బియ్యం, కూరలు తిని, చేతులార అనారోగ్యాన్ని తెచ్చిపెట్టుకున్నవారిని, మనం, అక్కడక్కడ చూస్తాం. ఇది చాలా తప్పు. మన ఆహారాన్ని బాగా ఉడకనిచ్చి, అందులోని విటమిన్లు పోకుండా చూచుకొని, నియమబద్ధంగా చేసుకుంటే, మనకు వైద్యమవసరమే ఉండదు. యెట్టి ఆహారం తీసుకుంటే, ఆరోగ్యకరమైనది, యే వేళలందు, యెంత తీసుకోవాలో, యివన్నీకూడా స్త్రీలకు తప్పక తెలియాలి. ఇంట్లో అందరు సౌఖ్యంగా ఆరోగ్యంగా ఉన్ననాడే ఆమెకు మనశ్శాంతి ఉంటుంది. ఎవరికి యేమి వచ్చినా యింట్లో ఆమెకే కష్టం. ఈ ఆహార పద్ధతులను గురించి సక్రమంగా తెలుసుకోడానికి, భిషగ్వర మల్లాది

రామమూర్తి శాస్త్రిగారు వ్రాసిన "ఆహార విజ్ఞానం" అనే పుస్తకం, అన్నివిధాలా తగినది. ఏమాత్రం అక్షరజ్ఞానమున్న వారికైనాసరే అర్థమయేటంత సులభశైలిలో ఉంది. ఇందులో ఆహారంయొక్క ఆవశ్యకత, పదార్థముల వివరణ, పాకక్రమం, ఆహార పరిమాణం, హితాహితాలు, పెద్దలకెట్టి ఆహారం కావాలో, పిల్లలకెట్లు ఆహారమివ్వాలో గర్భిణి స్త్రీలు, ఆహార విషయాల్లో యెట్టిశ్రద్ధ తీసికోవాలో అన్నీ, స్పష్టంగా ఉన్నాయి. ఇటువంటి పుస్తకాలను స్త్రీలు విధిగా చదివి తీరాలి. ఆహారము శరీర పోషణకు తగినదై, సరియైననాడు, ఆరోగ్యమునకెట్టి అవాంతరము రాదు. ఆరోగ్యము కలిగి ఉన్నంతకాలము వైద్యుల సలహా అవసరమే ఉండదు.

కాని అంతగా, వైద్యసహాయ మెన్నడైనా కావలసి వస్తే, వెంటనే, వైద్యుని దగ్గఱకు పరుగెట్ట నక్కర లేకుండా, ప్రతి స్త్రీ కూడా, కొన్ని సూక్ష్మ పద్ధతుల్ని తెలిసికోవాలి. ఈ చిన్న చిన్న వైద్యాలు తెలిసిననాడు, మొదటిరోజులలో అశ్రద్ధచేసి ముదరపెట్టక రోగ లక్షణాలు కనిపించగానే మొదటనే జాగ్రత్త తీసికోడానికి కొంత విజ్ఞానమవసరం. ఈ రోజుల్లో మందులకంటేకూడా ప్రకృతి వైద్యానికి ప్రాముఖ్యం హెచ్చుతోంది. అందులోను, వెంటనే పిలిస్తే వచ్చేందుకు వైద్యులులేని, ఊళ్లలో, యీ వైద్యం తప్పక తెలియాలి. "ప్రకృతి ఆరోగ్య వైద్యమని" (వి. దొండా సాహేబ్) ఒక చిన్న పుస్తకం, చదువ తగినిది. ఇందులో చాల జబ్బులకు మనం యెంతో భయపడి, వైద్యుల దగ్గఱకు పరుగుపెట్ట నక్కరలేకుండా చాలా సూక్ష్మంగా వైద్యంచేస్తే కుదిరే టట్లు చెప్పారు.

ఈ విషయాలే కాకుండా, స్త్రీలు కొంత మనస్తత్వాన్ని గురించికూడా తెలిసికోవాలి. ఆమె, రోజూ, యెదుటి వారిని యెంతో బాగా అర్థంచేసుకొని, వారి భావాల కనుగుణంగా నడచుకోవడం నేర్చుకోవాలి. మాట్లాడే పద్ధతులు అలవాటు చేసుకోవాలి, ఈ మనస్తత్వాన్నిబట్టే, ఆరోగ్య వంతులతోను, బలహీనులతోను, జబ్బుగా నున్నవారితోను, కోపధారులతోను, యేవిధంగా మాట్లాడాలో బాగా తెలిసి ఉండాలి. ఇంట్లో రోగులు ఉంటే, వాళ్లకు ధైర్యంగాను సంతోషంగాను కబుర్లు చెప్పాలి. అంతేగాని, రోగికంటె ముందు తానే అధైర్యపడి, వాళ్లయెదుటే అది కనపరిస్తే, మంచంమీద ఉన్నవారికి, అసలు జబ్బుకంటె, యీ భయం యెక్కువ అవుతుంది. జబ్బు తగ్గుదలకువచ్చిన తరువాత, బలహీనంతో కోపంకూడా యెక్కువ అవుతుంది. అదికూడ గ్రహించి, ఓర్పుతో, భరించాలి కాని, రోగులకు నిరుత్సాహం కలిగించకూడదు. ఇవన్నీ యింకా బాగా తెలిసికోడానికి, సేతు మాధవరావుగారు వ్రాసిన "ఆధునిక మానసిక చికిత్స" అనే పుస్తకం చదువవచ్చు.

ఇదేకాకుండా స్త్రీలు ప్రత్యేక శ్రద్ధతో తెలిసికోవలసిన సంగతులు ఉన్నాయి. ఈ విషయాలలో సరియైన జ్ఞానము లేకపోవుటచేతనే, మన దేశంలో స్త్రీలలోను, శిశువులలోను జబ్బులు చావులుకూడా యెక్కువ. స్త్రీల జీవితంలో, గర్భిణీ స్త్రీయొక్క దశ, ప్రతివారు తెలిసికోవాలి. ఆ సమయంలో ఆమె తీసికోవలసిన జాగ్రత్త బాగా తెలియాలి. ఈ సంగతులు తెలియక కేవలం, అజ్ఞానం మూలంగా, తమ ఆరోగ్యాలను పాడుచేసుకొని, కష్ట ప్రసవములకు, బాలెంత రోగాలకు గురియై యెందరో స్త్రీలు చనిపోవడం మనం చూస్తాం. ఒకవేళ సుఖంగా ప్రసవమైనా తరువాత ఆమె ఆరోగ్యంలో తీసికోవలసిన శ్రద్ధ, శిశువు విషయంలో చూపవలసిన మెలకువ తెలియకపోవుటచే యెన్నోచోట్ల మాతా శిశువులిద్దరు బలవన్మరణానికి బలి అవడం, మనం తరుచువింటాం. ఈ బాధలన్నీ నివారణ కావాలంటే, స్త్రీలు తమప్రాణాలను, తమ బిడ్డలప్రాణాలను రక్షించి, తమ జీవితాన్ని పూర్తిగా అనుభవించాలంటే, యిట్టి విషయాలు అత్యంత శ్రద్ధతో తెలిసికోవాలి. ఈ విధంగా వారి కుపయోగించే పుస్తకాల్లో డా॥ కొమర్రాజు అచ్చమాంబగారు వ్రాసిన "ప్రసూతి, శిశుపోషణ" అను పుస్తకం డా॥ పుచ్చా వెంకట్రమయ్యగారు వ్రాసిన "బాలెంతరోగం" అనే పుస్తకం ప్రతి స్త్రీకూడా చదివి ఉండాలి.

ఇంకా యీ పుస్తకాలే కాకుండా చిరస్మరణీయులు, శ్రీ కందుకూరి వీరేశలింగంగారు వ్రాసిన రచనలన్నీకూడా

స్త్రీలు చదివే పుస్తకాలు

స్త్రీలు చదువవలసినవే. వీరు, ముఖ్యంగా స్త్రీలలో ఉండే అజ్ఞానాన్ని పోగొట్టి సాంఘిక దురాచారాలిని అరికట్టి స్త్రీ అభ్యుదయానికై కంకణం కట్టుకున్నారు. వారి రచనలు, "సతీహితబోధిని", పత్నీ హితసూచని, స్త్రీ నీతిదీపిక, నీతి కథామంజరి, దేహారోగ్య ధర్మబోధిని యివన్నీకూడా ప్రతిస్త్రీ చదవాలి. వీటన్నిటిలోకూడా, వీరేశలింగం గారు, స్త్రీలు తప్పక తెలిసికోవలసిన విషయాలను, యెంతో తేట తెల్లంగా వివరించారు. స్త్రీలు తమ బిడ్డలకెట్టి శిక్షణ యివ్వాలో తన పతివ్రతా ధర్మాన్నెట్లు నెరపాలో భూత దయకలిగి ఉండాలని, మితవ్యయం అలవరచుకోవాలని, దేహారోగ్యం కాపాడుకోవాలని, స్త్రీ లెట్టి గుణదోషాలను కలిగి ఉంటారో, దోషాలనెట్లు పోగొట్టాలో పరోపకారత, జీవకారుణ్యం యిలాంటి యెన్నో విషయాలు చర్చించారు. కనుక వీరి రచనలు స్త్రీలకు ప్రత్యేక విజ్ఞాన సర్వస్వమని చెప్పవచ్చు.

(ఆల్ ఇండియా రేడియోకు కృతజ్ఞతతో)

★

"బడీమా"

శ్రీ కె. లింగరాజు గారు

ఆ నీలిరంగు కవరులో ఉత్తరం అందుకునేటప్పటికే నాకు కొన్ని నెలల నుంచి ఎడబాటు జీవితానికి మిథ్యా పథం అంటకట్టు కున్నట్టే అయింది. పుట్టింటికి వెళ్ళిన లక్ష్మి వ్రాసింది. ఇకనుంచి ప్రతివారంను ఆ నీలిరంగు వుత్తరాలు ఒస్తయి అన్న వుద్దేశ్యంతోటి, ఆశతోటి, రోజూ తపాల బంట్రోతు కోసం వెళ్ళవచ్చుననే ఆనందంతోటి గడప వచ్చునన్న అనునయం పెంపొందుతోంది.

వెళ్ళేటప్పుడు చెప్పింది, "ప్రతీ వారం మీ ఉత్తరం వస్తేనే నాకు సంతోషంగా వుంటుంది. దేవుడు దయ తలిస్తే......" ఇక చెప్ప లేకనే కన్నీళ్ళతో ఉన్న మొఖాన్ని నా ఛాతీమీద అన్చుకుంది. ఆ చెప్పలేని మాటల్లోని ఆవేదన, ఆరాటన, క్షేమ అన్నీ అవగాహన చేసుకున్నట్లే నాకు హృదయం గుబగుబలాడి పోయింది. కన్నీళ్ళు కారిపోయేయి......

ఆ తర్వాత నెలలో ఉత్తరాలు వ్రాయనే వ్రాసింది... కాని ఆ మధ్య ఉత్తరాల్లో మామగారి ఉత్తరం..."నీకు కుమారుడు పుట్టేడు" అన్నది నన్ను ఆషాఢమేఘంలాగే పింఛంవిప్పుకునేట్టు చేసింది...

ఇంకా ఏన్నో ఆ ఉత్తరం అందుకునేటప్పుడు తట్టేయి. ఎమిటో ఆ మాతృస్థానానికి నేను నా జీవితంలో ఇవ్వలేని కృతజ్ఞత అంతా స్పర్శలోనే కనపడ్డాయి. రక్తం మొఖమ్మీద అంతా చిమ్ముకుంది...

విప్పే! నలుగురు మధ్యా ఆఫీసులో వున్నా అది తీసి చదివే వరకూ హృదయం ఉండపట్టలేదు. "బోసినోటి వరహాల నవ్వుతూ, చిన్న మీ కళ్ళతో, నాఛాయతో మిమ్మల్ని ఎప్పుడు ఆహ్వానిద్దామా అని ఎదురు చూస్తున్న మీ పాపాయికి ఏలినవారి దర్శనం ఎప్పుడు ఇప్పిస్తారో..." తన ఛాయను పొగుడుకోవడంలో లక్ష్మికి ఉన్నంత అతిశయం ఎవరికి లేనేలేదు. ప్రతిరోజూ ఆక్షేపిస్తునే వుంటుంది, నా ఎండల్కి ఆహుతైన నల్ల శరీరాన్ని.

"మొన్నను ఆవిడ వచ్చింది. పాపాయిని చూచింది. కాగితాలు తయారు చేస్తానన్నది...తూకం వేసి ఇయ్యవలసినవన్నీ బోధించింది..." ఆ మాటలు అర్థం కాలేదు. పుట్టే పుట్టడం తోటే రాజా తన నిత్య సేవలకు 'ఆయా'ని తెచ్చుకున్నాడా? లేక ఏ పూర్వజన్మంలోనో ఉన్న పుణ్యం వల్ల దేవదూత లెవరైన మారు రూపుతో అవతరించేరా?

అర్థం కాలేదు. ఆవిడ!! ఎవరు? ఎక్కడనుంచి వచ్చింది? ఎవరు పంపేరు? ఎందుకు వచ్చింది? ఎవరు రమ్మన్నారు? ఈలాంటి ప్రశ్నలు ఎన్నో తట్టేయి. లక్ష్మిని చూసి ఏ పిల్లలులేని తల్లయినా నీకు ఏడుగడగావుంటానని మాట ఇచ్చి ప్రతీక్షణం తను ఆదుకుంటోందా?

ఎన్నో విధాలు ఆలోచించా! ఆవిడ వచ్చింది! ఇంట్లో అత్తగారు, మరదలు కాదన్నమాట. మరెవరు?

"తూకం వేసింది...కాగితాలు తయారు చేస్తానన్నది." నాకు తెలుసున్నమట్టుకు మా అత్తగారి మేనమామ ఆడపడుచు తోడికోడలు కూతురు ఒకత్తె మాత్రం డాక్టరీ చదువుతోంది. ఆవిడ తను చదువు కున్న రెండు సంవత్సరాల మిడి మిడి జ్ఞానం ప్రదర్శనం చేస్తోందా? ఎక్కడో కటక్ లో చదువుతున్నామె, ఇప్పుడు శెలవులూ కావాయె. ఎల్లా వచ్చింది...ఎందుకు వస్తుంది? మామగారేమైనా వ్రాసి రమ్మన్నారా?...అతుకుల బొంతలా కన్పించింది...

ఆవిడ? ఎవరు?...క్షణికం ముందర జీవితంలో వచ్చిన ఆయా నాకు తెలియకుండా వచ్చిందా? పాపాయిలు అంటే నోచుకోలేని మాతృస్థానం ఇల్లా సేవ చెయ్యడానికి తయారై కృతకృత్యురాలవడానికి సన్నద్ధం అయ్యిందా? ఓ వేళవచ్చినా తూకం వెయ్యడం కాగితాలు వ్రాయడం...?

ఎన్ని విధాలు సమన్వయం చేసుకుందా మనుకున్నా కుదరటం లేదు... లోపల ఓ ప్రక్క నా జీవితానికి ఆసరాగా, వంశం నిల్పడానికి పుట్టేడన్న సంతోషం శరీరం

అంతా వ్రాసుకున్నా...ఆవిడని గురించి సమాధానంకోసం ప్రశ్నలు రాకుండా ఉండలేక పోయేయి.

ఉత్తరం సగంలోనే ఎన్నో విధాలు తట్టేయి...కుదరని సమయాలుకు ఎక్కడ జతపరచడం...ఎంతో ఆనందతోటి. ఉత్తరం వ్రాస్తే ఆవిడని గురించి వ్రాయమన్నా...

అడుగుతున్నప్పుడు లక్ష్మి పూర్ణంగా ఆవిడని గురించి వ్రాయనందుకు కోపం వచ్చింది......

*　　　*　　　*

ఆ రెండు రోజులలోనూ 'ఆవిడ' ఎవరో అని ఆలోచనలు వెళ్ళుతూనే ఉన్నై. రెండు రోజులూ పోస్టాఫీసుకు వెళ్ళే...కాని ఉత్తరం రాలేదు. కోపం వచ్చింది...తన పాపాయిని చూచుకుని, పోలికల్ని లెక్కపెట్టుకుంటూ ఉండే లక్ష్మి నా సంగతి మర్చి పోయినందుకు తిట్టుకున్నా. ఎప్పుడూ ఇంతే ఈ స్త్రీలు! ఎదురుగా వుండినంత సేపే, ఇక దూరమైపోతే...

మూడో రోజు మామూలుగానే గడిచింది... ఆ సాయింత్రం పోస్టాఫీసుకు వెళ్ళకూడదే అనుకున్నా... దారిలోనే...అతడు పిల్చి నీలి కవరు ఇచ్చేడు...

పిల్లా తల్లి క్షేమం కంటె "ఆవిడ" ఎవరూ అన్న ప్రశ్నకే ఎక్కడైనా సమాధానం వ్రాస్తుందేమో అన్న ఆత్రుతే ఎక్కువగా ఉబకడంతోటి విప్పే...చదివే...

"ఆవిడ...ఆవిడే! మిమ్మల్ని ఓసారి చూచిందట... తర్వాత తరచుగా మీ కథల్ని చదువుతూనే వుందట. మీ కథలు ఈ మధ్య అంత బావోలేదట కూడాను..." మంచిగా, బావుగా వ్రాస్తున్నానని నన్ను పొగడితే అసలు వ్రాయడం మానేస్తానని లక్ష్మికి భయం...అంచేత ఎవరు ఏమన్నా అల్లాగే అన్నారని అబద్ధం వ్రాయడం సర్దా...

"ఓ సారి మీరు ఆమె కలసి గుంటూరు నుండి బెజవాడ వరకు ప్రయాణం చేసేరట..."

గుంటూరు నుండి బెజవాడ లక్షసార్లు ప్రయాణం చేసే...ముక్కు తిరుగుడు వ్యవహారంగా వ్రాయడం చిరాకు ఓప్రక్క నుంచి కల్గిస్తూనే యుంది.

"ఏ ఆదివారమైనా రాకూడదూ...ఆవిడా మిమ్మల్ని చూడాలని... మీతో మాట్లాడాలని......?

నాతో మాట్లాడాలి? ఏమిటి మాట్లాడుతుంది...కొంప తీసి ఏ పెద్దత్తేనా కాదుకదా ?...

లక్ష్మి మీద ఇల్లా వ్రాసినందుకు కోపం, చిరాకు, అసహ్యం,...అన్నిటి కంటె అర్నెల్ల స్నేహం చేస్తే...ఈ భావం కూడా తోచింది నాలో.

ఆవిడ ఎవరూ ?...ఎంత జ్ఞాపకానికి తెచ్చుకుందా మనుకున్నా జ్ఞాపకం రావటంలేదు ?...ఆవిడ ఎవరు ?...ఎవర్ని అడగను ?

*　　　*　　　*

ఏ ఆదివారానికి ఆవారం వెళదామని అనుకోవడం ఈ బ్యాంకుల్లో పని తెమలక పోవడంతోటి ఆదివారాలు సోమవారాలవడంతో సరిపోయింది. వారాలు నెలలు గడిచి పోయేయి. ఆ ఇరవై ఆదివారాల్లోనూ వారానికి ఓసారైనా లక్ష్మి ఉత్తరం ఒస్తూనేవుంది. "ఆవిడ రోజూ, లేకపోతే రెండు రోజులకు ఓసారి వస్తూనేవుంది...పాపాయికి మొన్న నీళ్ళు పొయ్యడంలో కొత్త విధానాన్ని చూపించింది...నాన్నారి చేత టర్కిష్‌టవల్స్, పౌడరు కొనిపించింది ... బట్టలు ఎల్లా వుండాలో... ఎప్పుడెప్పుడు పాలివ్వాలో, ఎంతెంత పాలు పట్టాలో...ఇవన్నీ చేస్తునే వుంది...చెప్పుతూనేవుంది..."

"మొన్న తనంతట తాను పాపాయి నోటి నవ్వును చూసి మురిసి పోయింది...తను చూచిన పిల్లలందరిలోనూ చాలా చలాకీ అయిన వాడని...మంచి ఆరోగ్యంగా..."

"మొన్న 'బేబీ వీక్'లో మన అబ్బాయికి ప్రథమ బహుమానంఇచ్చేరు...నిజంగా...ఆవిడే కారణం సుమండీ!"

"నిన్న పాపాయికి జ్వరం వచ్చింది...నేనే ఏడుస్తున్నాడని ఇంకోసారి పాలు ఎక్కువ పట్టేటప్పటికి కడుపు నొప్పి వచ్చి కాబోలు...అప్పుడు నన్ను ఎన్ని చివాట్లు పెట్టిందో..."

"ఇల్లా ప్రతీ విషయంలోనూ తానే ఏకుగడగా ప్రవర్తించే ఆవిడను చూస్తుంటే నేనా, ఆవిడా నిజంగా

మాతృస్థానానికి తగడం? అన్న క్షణిక ఈర్ష్యకూడా ఒస్తోంది..."

"మొన్న చెప్పింది...అనేక బొమ్మలు చూపించింది... ప్రతి నెలనెలకి పిల్లాణ్ణి ఎల్లావుంచాలో, చెప్పింది..."

ఇల్లా ఒస్తునే వుంది. ఒక్కొక్క ఉత్తరంలో ఒక్కొక్క అంశంతోటి...ఉత్తరాలు అన్నీ చూస్తుంటే ఆవిడ ఏరికైరైన మంత్రసానో అని నమ్మకం కుదిరి పోయింది...కాని లోపల్లోపల ఈ పిలవని పేరంటపు వైద్యానికి ఏమిచ్చుకోవాలో అని బెంగగానేవుంది.

ఆ ఉత్తరంలో వ్రాసేనూ ఎన్ని నెలల జీతం సమర్పించుకోవాలి 'ఆవిడ'కు అని...భలే ఆవిడ...

* * *

అన్ని రోజుల ఉత్తరాల్లోనూ ఆవిడ స్వయంగా ఒచ్చి పిల్లాడికి చేసిన ఉపచారాలు వ్రాయడమే కాని...తను ఎప్పుడొస్తుందో వ్రాయడం లేదు. నాకు ఇంక ఎన్నాళ్ళకు ఈ హోటల్ భోజనం గతో..అనుకుని లోపల మంటగానే వుంది...

అనుకోకుండగానే లక్ష్మి చంటి పిల్లాడితో దిగింది. ఆశ్చర్యమే కల్గించింది...ఆ గుమ్మంలోంచి లోపలికి వచ్చి రావడంతోటే పాపాయిని చూచే! నా అంతట నాకు లక్ష్మి ఇల్లాంటి, ఇంత చక్కటి, ఆరోగ్యవంతుణ్ణి, నాకు ఇచ్చినందుకు నేను ఏ విధంగా కృతజ్ఞత తెల్పుకోవాలో తెలియకుండానే అల్లాగే ఉండిపోయే! ఆ ఆనందంలో కళ్ళు కొంచెం తడి అయ్యేయి.

"ఆవిడ పెంచింది...నేను మాత్రం కన్నాను... ఆవిడ లేకపోతే!..." లక్ష్మి దగ్గరగా ఒచ్చి పాపని చేతుల్లో పెడుతూనే అంది.

"నాన్నారు పాతికరూపాయిలు ఇవ్వబోయేరు కాని ఆవిడ పుచ్చుకోనే లేదు..."

ఆవిడ!! నాకు ఆశ్చర్యంగానే వుంది! ఏం పని? ధనవంతురాలా? ఈ పిల్లల సంరక్షణవల్ల, భావిభారత భాగ్యోదయంలో సువర్ణ కలికలుగా తయారు చెయ్యడానికి తన జీవనం త్యాగం చేస్తోందా? భావి ప్రపంచం అంతా ఇప్పటి ఈ సంతానపు పెంపు, శిక్షణల మీద ఆధారపడి వుందనినమ్మి, తన ఆశయమును ఇల్లా ప్రచారంచేస్తోందా?... ధన్యజీవి అనుకున్నా...జీజీబాయ్...అల్లాంటి మాతలంతా జ్ఞాపకం ఒచ్చేరు...

"ఆ రోజే తను ఇక వచ్చే నెలల్లో, సంవత్సరాల్లో పాపని ఎల్లా పైకి తీసుకురావాలో చెప్పింది. మర్చిపోతానేమో అని వ్రాసి ఇచ్చింది కూడా"...

అన్నీ చూచే...ఏ వయస్సులో ఏ ఆహారం ఇవ్వాలి... పళ్ళు ఒచ్చేటప్పుడు ఎల్లా పిల్లల్ని జాగ్రత్త పరచాలి, తర్వాత మాటలు వచ్చినపుడు ఏం చెప్పాలి...ఇంకా పెద్ద అయిం తర్వాత ఎల్లాంటి కథలు చెప్పాలి......ఎన్నో...

ఆక్షణంలో ఆవిడే నా ఎదురుగా వుంటే చేయెత్తి పూర్ణ నమస్కారం చేసే వుండేవాణ్ణి... ఆవిడ! ఎక్కడ సంపాదించింది ఈ ప్రజాసేవ? భావిభారత భాగ్యోదయానికి పునాదులు వేసే మాత...ఎక్కడ వుంది?...అన్న ఆనందమూ కల్గింది...ఏం ఇస్తే ఋణం తీరుతుంది?

అవిడణ్ణి చూడాలి. మాట్లాడాలి అన్న కోర్కె నాకు హెచ్చైపోతునేవుంది...

* * *

పాపకి ఐదేళ్ళు వచ్చేయి. ఆ వయస్సులోనే ఎంతో చలాకీగా ఎన్నో వీర కథలు చెపుతాడు. వింటాడు... నాకు వాణ్ణి చూస్తుంటే భావిలో వీడు ఏ నియంతైనా అయిపూరుకుంటడేమో అన్న ఆశకల్గుతూనే వుంటుంది...

ఆ పుట్టిం రోజుకు నేను స్వయంగా ఆవిడని రమ్మని ఉత్తరం వ్రాసే...కబురుకూడా పంపే... ఒస్తుందన్న నమ్మకం నాకు ఇదివరకటి పుట్టిన రోజుల ఆహ్వాన సమాధానాల వల్ల లేదు...

ఆ సాయంత్రం ఎవరో ఒస్తునే వున్నారు... వెళుతూనే వున్నారు...లక్ష్మి అధాత్తుగా వస్తూనే! ఏమండోయ్! ఆవిడ వచ్చింది...రాండి..."

ఆవిడ! ఆవిడ!! లోపల్కి వెళ్ళే...సన్నగా, పొడుగ్గా

ఇరవై అయిదువత్సరాలలోపుగా, చామనచాయలో ఉన్న ఆమె, ఆవిడా? ఈ సన్నగా పూవలావున్న స్త్రీలో, ఇటువంటి మహోన్నత భావాలు నిబిడీకృతం అయివుండి, ఇప్పుడు ప్రజల్లోకి, ప్రతీ మాతృ హృదయంలోకి చొచ్చుకుంటున్నాయా? ప్రతీ పెరిగే బిడ్డా ఇప్పుడున్న ఈ మురికి మురణ వాతావరణాల్లోంచి వీర చరిత్రలకు పునాదిరాళ్ళు వేసుకుంటున్నారా...?

అల్లాగుడ్డు అప్పగించి నమస్కరించే!! నవ్వుతూనే ఆవిడా నమస్కరించింది..." మీ వాడు చాలా అల్లరివాడు సుమండీ... దేవాంత కుడిలావున్నాడు..." చేతుల్లోకి తీసుకుంటునే అంది...

" మీ చలవే కాదా?" ఆ ముక్కలు నాకు నిజంగా హృదయాంతరాళాల్లోంచి విశ్వవిపంచి గానం చేస్తుంటే మ్రోగినట్టే ఒచ్చేయి. ఏ విధంగా కృతజ్ఞత చూపుకోవాలో నాకు తెలియటం లేదు.

మర్నాడు పళ్ళెంలో ఏవో పెట్టి లక్ష్మి ఆవిడకి కృతజ్ఞతగా ఇవ్వబోయింది. ఆవిడా నవ్వుతూనే నేనే మీ అబ్బాయికి ఆనందంగా ఇస్తున్నా. రేపు మీ వాడు పెరిగి పెద్దవాడై కీర్తి గౌరవాలు తెస్తే అదే నాకు ఆనందం. అంతకంటె నాకు ఇంకేం కావాలి..."

ఆ హృదయంలో ఇంత విశాలత్వం, అమరత్వం ఎక్కడ దాక్కుని ఉన్నాయా అనిపించింది...బండి ఎక్కుతూనే తన విజిటింగ్ కార్డు ఇచ్చింది... "మిస్......లేడీ హెల్తు విజిటర్..."

ఉద్యోగా!! పిల్లల్ని సంరక్షించడానికి ప్రభుత్వం నియమించిన " బడీమా "?

వాకబు చేసే...అరవైరూపాయిల జీతం...రెండు జిల్లాల క్యాంపు. పదిరూపాయిల భత్యం...లంచాలు పుచ్చుకోకూడదమా... వెనక్కు తిరిగి అనుకున్నా...ఆవిడ కడుపు కేం మిగల్తుంది అని...ప్రతీ మాతృ హృదయం ఋణంగా ఆవిడికి ఆ జన్మాతరంపడి వుందేమో! మరి ప్రభుత్వం! అధికారులు?

★

మందుల మనిషి

శ్రీమతి తాతాని సుబ్బులుగారు

మోటుచీరతల్లో, సుబ్బమ్మగోరు
ముద్దెయ్యితల్లో, రాజమ్మగోరు
గుడ్డెయ్యితల్లో, మక్కమ్మగోరు
కరువోచ్చితల్లో, కాలుతుండంతల్లో
విశాఖలోతల్లో విలపిత్తుంద్రుతల్లో
కడపలోతల్లో, కష్టపడుతుంద్రతల్లో
అనంతపురంలోతల్లో, అలమటిస్తుంద్రుతల్లో
కంట్రోలుతల్లో, కలకాలముండదుతల్లో
తిండికరువుతల్లో, గుడ్డకరువుతల్లో
పెకాశంగోరుతల్లో, పెధానైయెతల్లో
గుడ్డకరువుతల్లో, పోతాదితల్లో
ఊమూరతల్లో, రాటాలుతల్లో
పెట్టించితల్లో, సేత్తుంద్రు సేవతల్లో
గాంధిగోరుతల్లో, చల్లగుండలితల్లో
కాంగ్రెసోరుతల్లో, కష్టాలుతీర్చుతరుతల్లో
అల్లరిచేయకండితల్లో, మల్లోస్తంతల్లో
ఏటికొాకమారుతల్లో, మేమొస్తంతల్లో
గాంధిగోరుపుట్టుకతల్లో, కలియుగానతల్లో
పండుగతల్లో, పరమానందంతల్లో ||

★

నాది నాది నాది




నాది నాది నాది

అమృతాంజనము

గాని,

“ యధాయధా................కాళీధవళత్వ శంకయా.”

అమృతాంజనమా ! నీ కీర్తిముల్లోకములను దెల్పఁజేయు పూసికతో పెరుఁగు చున్నప్పుడెల్లను, నా నల్లని ముంగురులు, దెల్లబడునేమోయను భయముచే నా హృదయము మిక్కిలి పరితాపమొందుచున్నది సుమా !!!



దుగ్గిరాల ఫిర్కా మహిళా మహాసభ

అధ్యక్షులు :— డాక్టరు అచ్చమాంబ (రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ కమిటీ ప్రెసిడెంటు.)

జండా ప్రతిష్టాపకులు :— కొమర్రాజు పద్మావతి (బెజవాడ టౌన్ మహిళాసంఘ సెక్రటరీ.)

ప్రారంభకులు :— మోటూరు ఉదయం (గుంటూరు జిల్లా మహిళా సంఘ అధ్యక్షులు.)

ప్రతి గ్రామమునుంచి వందలకొలది సభకు రావలెననే ఉత్సాహముతో ప్రజలు యున్నారు. కాని, దురదృష్ట వశాత్తు ఆ ప్రొద్దుటనుండి బోరున వర్షము ప్రారంభమైనది. చిన పాలెంలో స్త్రీలు నిరుత్సాహపడినా, పట్టుదలతో సభను జయప్రదము చేయాలని తెల్లవారు ఝామున 30 మంది స్త్రీలతో ప్రభాతభేరీ జరిపినారు. గ్రామమంతా మామిడి తోరణాలతో, స్వాతంత్ర్య, శాంతి, అభ్యుదయ జండాల తోను స్త్రీలకు సమాన ఆస్తిహక్కు కావాలీ - బహుభార్యత్వం నిషేధించాలి, - విడాకుల హక్కు కావాలి, - ఒకే పనికి సమానకూలి యివ్వాలి, అని వున్న నినాదాల అట్టలతో గ్రామమంతా అలంకరించ బడినది.

ప్రతినిధులు వివిధ గ్రామాలనుండి 250 మంది వచ్చినారు. మధ్యాహ్నము 3 గంటలకు పాటలతో సభ ప్రారంభమయినది.

మొదట ఉదయంగారు, అధ్యక్షులైన డాక్టరు అచ్చమాంబగారిని, జండా ప్రతిష్టాపకులైన కొమర్రాజు పద్మావతి గారిని పరిచయపరిచి వారిని సభాస్థలాన్ని అక్రమించమని పూలదండలతో గౌరవించినారు. మోటూరి వుదయంగారు —ఫిర్కా మహిళా ఉద్యమము పది గ్రామాలలో వున్నదని, నాలుగు గ్రామాలలో నిర్మాణంగా ఆఫీసులు, లైబ్రరీలు, దిన పత్రిక తెప్పించుకొనుట, గ్రామస్త్రీల నిత్య జీవితంలో యిబ్బందులను తీరుస్తూ పనిచేయుచున్నారని చెప్పినారు.

తరువాత అధ్యక్షులైన డాక్టరు అచ్చమాంబగారు ఇలా మాట్లాడినారు:—

"ప్రతి పోరాటంలో స్త్రీలు ముందుకు వస్తున్నారు. వారి హక్కులకై ఎన్నో త్యాగాలు చేస్తున్నారు. ఈ నాడు ఇదివరకు కంటే స్త్రీలకు మనోనిబ్బరం, ధైర్యం వచ్చినది. మహిళాసంఘం స్థాపించేటప్పుడు స్త్రీలకు "చదువు కావాలి, సంఘ బానిసత్వం పోవాలి. స్త్రీలకు ప్రసూతి సౌకర్యాలు కావలె"ననే ఆదర్శాలతో బయలుదేరినాయి. రాను రాను విజ్ఞానంతో స్వాతంత్ర్య పోరాటంలో మన బాధ్యతగుర్తించి కార్యోన్ముఖుల మయినాము.

రాష్ట్ర మహిళా ఉద్యమము ప్రారంభమైనది. అది మీరు పేపరులో చూచేయుంటారు. కృష్ణా, గుంటూరు, తూర్పు, పశ్చిమ గోదావరి, నెల్లూరు, విశాఖ జిల్లాలలో మన ఉద్యమము దినదినాభివృద్ధి గాంచుచున్నది. వెనుకబడిన జిల్లాలలో మన ఉద్యమము నిర్మించాలి. ఐక్య మహిళా ఉద్యమనిర్మాణంతో మన హక్కులు సాధించటానికై రాష్ట్ర మహిళా ఉద్యమము నిర్మింపబడినది. మనం హక్కులు సాధించేంతవరకు నిరంతర ఆందోళన సల్పాలి. నైజాం, తిరువాన్కూరు సంస్థానాలలో నున్న మన సోదరీమణులు మాన, ప్రాణ బంధాలకు వెరువక నిరంకుశత్వానికి వ్యతిరేకంగా గొప్ప పోరాటం సల్పుతున్నారు. అలా ఎవరికివారు ధైర్యంతో ముందుకు రావాలి."

ఈ వుపన్యాసం వర్కర్లలో నిరుత్సాహం పారద్రోలి కార్యోన్ముఖులను చేసింది. తరువాత యీ క్రింది తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించబడినవి:— సంస్థానాలలో నిరంకుశత్వం - ముఖ్యంగా నైజాం నిర్బంధ విధానాన్ని ఖండించుతూ - స్త్రీలకు సమాన ఆస్తిహక్కు - రావు కమిటీ సవరణ బిల్లులను చట్టరూపంలో తేవాలని - జమీందారీ విధానము ఎట్టి కెమిషన్ లేకుండా రద్దుకావాలని - ఒకే

పనికి స్త్రీ పురుషులకు సమానకూలి యివ్వాలని - టెక్స్టైల్ పాలసీని నిరసించుతు సంవత్సరానికి 5 గజముల గుడ్డ స్త్రీలకు ఒక చీరకు చాలదు గాన కాంగ్రెసు ప్రభుత్వాన్ని మన దేశంలో నూతన నూలు, గుడ్డమిల్లులను పెట్టి పారిశ్రామికంగా అభివృద్ధిచేయాలని కోరినారు. రాత్రి 8 గంటలకు బహిరంగసభకూడ జరిగింది.

తరువాత క్రాప గ్రామ మహిళా సంఘ దళం 10 నిముషాలు బుర్రకథ చెప్పారు. తర్వాత దుగ్గిరాల ప్రజా కాపు మండలివారు "చాయా నాటిక" బ్రిటిషు ప్రభుత్వం క్రింద బంగారుపండే భారతదేశం, ప్రజల జీవితం ఎలా తారుమారు అయిందో కళ్ళకుకట్టినట్టు చూపించారు. జయజయధ్వనులతో సభ ముగిసింది. —మోటూరి ఉదయం,

జిల్లా మహిళా సంఘ ప్రెశిడెంటు.

మహిళా సభ, తాడేపల్లిగూడెం

యీ నెల 5-12-46 తేదిని 2 గంటలకు శ్రీమతి యమున రత్నావతి దేవిగారి యధ్యక్షతను జరిగినది. తొలుత సంవత్సర నివేదికానంతరం శ్రీమతి దామోజీపురపు నారాయణమ్మగారు దేశ స్థితిగతులను గురించి చెప్పిరి. తరువాత దా॥ లక్ష్మీ నారాయణమ్మగారు అఖిల భారత మహిళా సభ, దానికి రాష్ట్ర జిల్లా తాలూకా సంఘములు శాఖలు గురించి, దేశ పరిస్థితులను గురించి, కలకత్తా, నౌఖాలీ, బీహారు మతకల్లోలములు గురించి, నైజాంలోని ఆంధ్ర జిల్లాలలో జరుగుచున్న దాడులగురించి ఉపన్యసించిరి.

తీర్మానములు

హిందూ మతాభిమాని సనాతన ధర్మ నిష్ఠాత్ముడు అగు పండిత మదనమోహన మాలవ్యాజీ నిర్యాణముపట్ల స్త్రీలు తమ గాఢసంతాపమును వెలిబుచ్చిరి. మతకల్లోలములనుఖండించిరి. నైజాము దురాచారములను యీ సభవారు గర్హించిరి. హిందూస్త్రీల ఆస్తి హక్కు చట్టము త్వరలో అమలుపర్చుచున్నందుకు మద్రాసు ప్రభుత్వంవారిని ప్రశంసించిరి. ఆంధ్ర స్త్రీలపైన, ఆంధ్ర ప్రజలపైన నైజాము ప్రభుత్వం చేయుచున్న అత్యాచారముల విచారణకొరకు కమిటీని ఏర్పాటు చేయుటకును, అవి వెంటనే నిలుపుదల చేయుటకు, ఆందోళన జేయుటకు ఆంధ్ర మహాసభను, ఆంధ్ర నాయకులను యీ సభవారు కోరుచున్నారు. త్వరలో రానున్న ప్రజాపరిషత్తులో ఆంధ్ర రాష్ట్రముకొరకు ఒత్తిడిచేయుటకు ఆంధ్ర సభ్యులను యీ సభవారు కోరుచున్నారు. యీ తీర్మానములపై శ్రీయుతులు దా॥ రామాయమ్మ, కె. విమలాదేవి, ఎ. కాంతమ్మ, దా. శేషగిరమ్మ, దా. కనకరత్నం మొదలగువారు ఉపన్యసించారు. తరువాత నౌఖాలీ స్త్రీలసహాయార్థం నిధిని ఏర్పాటు చేయుటకు ఒక కమిటీ ఏర్పాటు అయినది.

—దామోజీపురపు లక్ష్మీనరసమ్మ, సెక్రటరీ.

పట్టణ మహిళాసంఘం, విజయనగరం

శ్రీమతి ఎమ్. చంద్రావతిగారి అధ్యక్షతను 26-12-46 సాయంత్రము నైజాం దురంతాలను ఖండించుటకు స్త్రీలసభ జరిగింది. శ్రీమతి డి. ఎస్. విద్యాదేవి (బి. ఎ., బి. ఎల్.) గారు మాట్లాడినారు. సంస్థాన ప్రజా పోరాటాలు, బ్రిటిషు యిండియాలోని పోరాటాలు వేరువేరు రూపాలు ధరించినా, అన్నీ బ్రిటిషు పరిపాలనాధికారమును అంతమొందించుటకే తోడ్పడును కనుక, స్త్రీలందరూ హైదరాబాదులో నల్లగొండజిల్లాలో జరుగుతున్న అత్యాచారాలను నిరసించి, ప్రజా ఉద్యమాలను బలపరచాలన్నారు. తరువాత డాక్టరు జె. వి. లక్ష్మీగారు నిరసన తీర్మానాన్ని ప్రవేశపెడుతూ, తెలంగాణా ప్రజలమీద జరుగుతున్న హింసాకాండ నంతా వివరించి, ఈ మారణ హోమాన్ని వెంటనే ఆపుచేయుటకు తాత్కాలిక ప్రభుత్వ ఉపాధ్యక్షుడయిన పండిట్ నెహ్రూ, మద్రాసు ప్రధాని ప్రకాశం పంతులు వెంటనే కలుగచేసికోవాలన్నారు. ఆంధ్ర మహాసభ కమ్యూనిస్టు పార్టీలమీద నిషేధమును తొలగించాలని, బందరునుంచి వెళ్ళిన రాయబారవర్గ సభ్యులను వెంటనే విడుదల చేయాలని కోరారు.

శ్రీమతి కె. రేణుకగారు మద్రాసు ప్రభుత్వ పాలసీని ఖండించుతూ తీర్మానం ప్రవేశపెట్టినారు.

—జె. వి. లక్ష్మి, అధ్యక్షులు.

పశ్చిమ గోదావరి జిల్లా మహిళాసభ

డి. 7 వ తేదీ శనివారము శ్రీమతి అదుర్తి భాస్కరమ్మగారి యధ్యక్షతను పశ్చిమ గోదావరి జిల్లా మహిళా సభ

కొవ్వూరు గ్రామమున సంస్కృత బాలికా పాఠశాలా భవనమున జరిపిరి. సభకు తాడేపల్లిగూడెము, అత్తిలి, కేలంగి, నర్సాపురం, పాలకొల్లు, తాళ్ళపూడి, రాజమండ్రి గ్రామములనుండి పురస్త్రీలును, కలువురు వచ్చిరి. దిగుమర్తి బుచ్చికృష్ణమ్మగారు సంస్కృత బాలికా పాఠశాలలో "రాట్నపరిశ్రమ" ప్రారంభోత్సవము జరిపిరి. నాళం సుశీలమ్మగారు, దుర్గ విద్యాదేవి, ఉప్పలపాటి పంచాక్షరమ్మ, అయ్యదేవర బాలా త్రిపురసుందరమ్మ, చి. సీతామహాలక్ష్మమ్మ, వి. హేమలత గార్లు సాంఘిక విద్యావిషయిక తీర్మానములపై మాట్లాడిరి.

సభానంతరమున సంస్కృత బాలికా పాఠశాల బాలికలు "భరత మాత" టేబ్లో, "భరత నాట్య" ప్రదర్శనము చూపి సభ్యుల నానందపరచిరి. సభలో యీ క్రింది తీర్మానములు ఆమోదింపబడినవి.

1. గొప్ప సంస్కృత పండితుడును, దేశాభిమానియు, బాలబాలికల కొరకు కాశీలో నెలకొల్పబడిన విశ్వవిద్యాలయ స్థాపకుడును, హిందూమతోద్ధారకుడును అయిన శ్రీ మదనమోహన మాలవ్యాగారి మరణమునకు ఈ సభవారెంతయు చింతించుచున్నారు.

2. ఆంధ్ర స్త్రీల యభ్యున్నతికై యనేకవిధముల పాటుపడుచు సంఘసేవయే తన జీవిత పరమావధిగా నెంచి మొదటినుండియు నీ యఖిల భారత మహిళా సంఘములో సభ్యురాలుగా నుండి విశేషముగా పనిచేసి జీవితమును చాలించిన శ్రీమతి తుర్లపాటి రాజేశ్వరమ్మగారి యకాలమరణమునకు నీ సభవారెంతయు విచారించుచు, నత్యంత ప్రేమాస్పదులైన భర్తగారికి, బంధువులకు తమ సానుభూతిని తెలుపుచున్నారు.

3. అంతర్జాతీయ మహాసభకు భారతదేశముతరఫున వెళ్లిన స్వతంత్ర భారతదేశ ప్రథమ ప్రతినిధివర్గమునకు నాయకురాలుగా నుండి భారత నారీమణులలో నంతర్లీనమైయున్న ధైర్య సాహస పరాక్రమ విజ్ఞానము లెట్టివో ప్రపంచమునకు చాటుచు హైందవ స్త్రీలకు విశేష గౌరవమును తెచ్చుచున్న శ్రీ విజయలక్ష్మీ పండిట్ యొక్క విజయమును నీ సభవారెంతయు కొనియాడుచూ ఆమెకు తమ హృదయపూర్వకాభి వందనము లర్పించుచున్నారు.

4. ఏక గోత్రీకులు వివాహము చేసికొనుట ధర్మవిరుద్ధము కాదనియు, నది చట్టబద్ధమే యనియు సమర్థించుచు అట్టి వివాహములు న్యాయసమ్మతము లగుటకు చట్టమేర్పరచి యాచరణలో పెట్టిన శాసననిర్మాణ సభ్యుల నీ సభవారభినందించుచు రావుకమిటీవారు తీసికొనివచ్చిన స్త్రీల ఆస్తి హక్కునుగూడ త్వరలో ఆచరణకు గొనిరావలయునని కోరుచున్నారు.

5. దేశానర్థముల కన్నిటికిని మూలకారణము దేశములో వ్యాపించియున్న అజ్ఞానము, నిరక్షరాస్యత అవి తొలగిన గాని దేశ మభ్యున్నతస్థితికి రాజాలదు. కాబట్టి సాధ్యమైనంతత్వరలో దేశమంతట నిర్బంధోచిత ప్రాథమిక పాఠశాలల నెలకొల్పి ప్రజలలో జ్ఞానజ్యోతిని ప్రకాశింపజేయ కేంద్ర స్థానిక ప్రభుత్వములు తగినశ్రద్ధ వహింతురని ఈ సభవారాశించుచున్నారు.

6. ఉన్నత విద్య, బోధనాభ్యాసము, చిత్రలేఖనము, సంగీతము, నృత్యము మొదలగు కళలను అభ్యశింప యితర ప్రాంతములనుండి రాజమహేంద్రవరమునకు వచ్చు విద్యార్థినులకును, ఉన్నత బాలికా పాఠశాలలో ఉపాధ్యాయినురాండ్రుగా వచ్చే స్త్రీలకును, తగిన వసతిగృహములు లేకపోవుటచేత వీరు చాలా ఇక్కట్టులకు లోనుగావలసి వచ్చుచున్నది. వారికొరకొక వసతిగృహమును నెలకొల్పి తగిన సౌకర్యములను కల్పింపవలయునని ఈ సభవారు విద్యాశాఖాధికారులను గోరుచున్నారు.

7. వివాహములలో వరకట్న నిర్బంధమువలన ననేకానర్థములు కలుగుచున్నవి. ఈ కట్నములకొఱకు కెక్కువగా నిర్బంధించువారు స్త్రీలేఅను వాడుకకూడ నున్నది. వరకట్నములవలన కలుగు అనర్థములను, కట్నములను కోరుటలో గల నీచత్వమును గుర్తించి, వానిని పూర్తిగా నిరసించవలయునని ఈ సభవారు స్త్రీల నందరును ప్రార్థించుచున్నారు.

8. ప్రస్తుత పరిస్థితులలో మన దేశములో గ్రామ పరిశ్రమల కెక్కువ ప్రాముఖ్యత ఏర్పడినది. అన్నిటిలోకి మిక్కిలి ప్రధానమైనదియు, స్త్రీలు చేయుట కెక్కువ తగియున్నదియగు నూలువడకు పరిశ్రమను స్త్రీలందరు తీసుకొని

క్షేత్రాలలో పని చేయవలయునని ఈ సభవారు స్త్రీల పక్షాన కోరుచున్నారు.

9. పేదల కుచితముగా చికిత్స చేయుటకు ఏర్పడిన ధర్మ వైద్యాలయములోని వైద్యులు, నర్సులు మొదలగు వారిలో లంచగొండితనము, దురాశ యెక్కువై ప్రజలకు తగిన వైద్య సహాయము లభింపక చాల కష్టపడుచున్నారు. ఈ లంచ గొండితనమును పూర్తిగా నిర్మూలింపజేసి ప్రజలకు వైద్య సౌకర్యముల నెక్కువ చేయవలెనని ఈ సభవారు ప్రభుత్వ మును కోరుచున్నారు.

10. రైలుబండ్లలో స్త్రీలకొరకు ప్రత్యేకింపబడిన ఇంటరు, మూడవ తరగతిపెట్టెలు ఒక్కొక్కటిమాత్రమే యుండుటను, అవియైనను పెద్దవిగాక, చాల చిన్నవిగ నుండుటచేత స్త్రీలు చాల యిబ్బందిపడవలసి వచ్చుచున్నది. స్త్రీల కొరకు ఏర్పరచే పెట్టెలు ఎక్కువ చేయవలయునని ఈ సభ వారు రైల్వే అధికారులను కోరుచున్నారు.

11. రాబోవు మద్రాసు శాసనసభలో హిందూ స్త్రీల ఆస్తిహక్కుల చట్టమును ప్యాసుచేయుటకు ప్రవేశపెట్టి యున్నారు. నడుచు చట్టము చేయుటవల్లను యితరహక్కు సంపూర్ణ స్వాతంత్ర్యహక్కు కలిగినట్లు పరిగణించుచు, నడుచు చట్టమును ప్యాసుచేయించ గలందులకు ఈ సభవారు మద్రాసు ప్రభుత్వమువారిని కోరుచున్నారు.

12. తండ్రిఆస్తిలో కుమారునితో పాటు కుమార్తెకు కూడ సమానభాగము నిచ్చునట్లు "హిందూ లా" ను సవ రణ చేసి చట్టమును చేయవలయునన్నందుకు ప్రభుత్వము వారిని ఈ సభవారు అభినందించుచున్నారు.

13. దేవదాసీ పద్ధతిని తొలగించు చట్టమును శాసనసభ లలో నామోదించునట్లు చేయుచున్న ప్రముఖుల కృషిని ఈ సభవారు అభినందించుచు దీనిని త్వరలో సభలలో పెట్టగలం దులకు కోరుచున్నారు.

14. స్థానిక సంస్థలలోను, శాసననిర్మాణ సభలలోను స్త్రీల స్థానములు నెక్కువ చేయవలయునని ప్రభుత్వము వారిని ఈ సభవారుకోరుచున్నారు.

—యం. వేదవల్లి తాయారమ్మ, కార్యదర్శిని.

★



భారతమాత స్తుతి : బరంపురం మహిళా సమాజ విద్యార్థినులు.

తెలుగు తల్లి

శ్రీయుత మాగంటి బాపి నీడుగారి "తెలుగు తల్లి" మా 'ఆంధ్ర మహిళ' దగ్గరకు చేరింది! ఆంధ్ర బాల సర్వస్వ మని యీ పుస్తకం కంటబడినంతనే పుటలు త్రిప్పి గ్రంథం ఆమూలాగ్రంగా అవలోకించని తెలుగువారు ఉండ రనే చెప్పాలి. పిల్లలకోరకై, తెలుగుభాషలో, పిల్లలకు సులభంగా బోధపడేశైలిలో, వారికి అన్నిరకాల విజ్ఞానాల్నీ అందిస్తూ, జాతీయతాభావాల్ని రేకెత్తిస్తూ వ్రాయబడ్డ పుస్త కాలు మనకు చాలతక్కువ. తెలుగుజాతి ఏకత్వానికి, తెలుగు వెలుగు చూపడానికి, తెలుగు పిల్లలకు బొమ్మల ద్వారా చిన్నపుస్తకం ఎందుకుండరాదన్న శ్రీ బాపినీడుగారి సంకల్పమే యీ 'తెలుగు తల్లి' రూపంగా తయారైంది. తెలుగు పిల్లలకు తెలుగువెలుగు చూపి, విశాలాంధ్ర దృష్టిని వికసింపజేసి, రానున్న ఆంధ్రరాష్ట్రంలో ఉత్తమ భావి పౌరుల్ని తయారు చేయడానికి యీ పుస్తకం అమోఘంగా తోడ్పడుతుంది; పిల్లలకు తెలియవలసిన అనేక తరహాల విష యాల్నిగురించి, అత్యంత ఆకర్షవంతంగా తెలియజెపుతూ యుంది. పిల్లల కివి చప్పున గ్రాహ్యమయ్యేటట్టు బొమ్మలు కూడా విస్తారంగా యుండడం ముదావహం. 'తెలుగు తల్లి' ప్రతీ తెలుగువారి యింట్లోను, పిల్లలతో బాటు తల్లులకు గూడ గొప్ప విజ్ఞానదాయకంగా యుండదగ్గ గ్రంథంగా రచించి, ప్రకటించిన శ్రీ బాపినీడుగారి కృషికి ఆంధ్రులంతా అభినందించవలసి యుంది.

తెలుగు తల్లిని తప్పకుండా తెలుగువారంతా కొనండి. వెల 2 రూ. లే. జాతీయ జ్ఞాన మందిరం, త్యాగరాయ నగరం, మద్రాసు వారియొద్దా, హిగిన్ బాతమ్సు బుక్ స్టాల్సులోనూ లభిస్తుంది.



శ్రీ రామకృష్ణ ప్రభ

శ్రీ రామకృష్ణ మఠము, మైలాపూరు, మద్రాసు వారు ప్రకటించిన యీ అక్టోబరు, నవంబరు, డిశెంబరు మాస పత్రికలు మాకు చేరినవి. విడిపత్రిక 6 అణాలు, సాలు చందా 3 రూ. లు. ఈ పత్రికగూడ శ్రీ రామకృష్ణ- వివేకానంద వాఙ్మయమును అపూర్వకముగా నాంధ్రీకృత మొనర్చుచున్న శ్రీ చిరంతనానంద స్వామిజీ వారి సంపాదకత్వము క్రిందకు వచ్చివేయుటజూడ నాంధ్రలోకమున కిక శుభోదయమగు చున్నటులే దోచుచున్నది. అతి గహనమైన ఆధ్యాత్మిక విష యములు సామాన్య జనములకు సుబోధకమగునట్లు, నిత్య జీవితములో ననుష్ఠానయోగ్య మగునట్లు, నిర్దుష్టమైన శైలిలో, అనవరత 'జ్ఞాన సంతర్పణ' గావించుచుండిరా! యనున ట్లుండెడి వీరి రచనలకు ఆంధ్రభాషలో నొక విశిష్ట స్థాన మిదివరకే యేర్పడియున్నది. శ్రీ చిరంతనానంద స్వామిజీ కృతమగు నెంతటి చిన్నవ్యాసము చదివినవారలైనను వీరి రచనలలో నన్నియు గాకున్న కొన్నియైనను నాతురతతో బఠింపకుండనుండలేరు; పఠించినవారి ప్రవర్తన, పరివర్తన నంద కుండ నుండలేదు. అంతరాత్మ అంతరాత్మతో మాట్లాడుచున్న టులు, వినినపలుకులు హృదయమున హత్తుకొనిపోవునటులు, మరచిపోవుదమన్నను మరి మరపునకు రానియటులు, శ్రవణేం ద్రియమునబడినంతనే ననివార్యమగు చిత్తసంస్కరణ గలి గించునటులు, శ్రీ వివేకానందుఁడే ఆంధ్రమున నుపన్యసించు చుండిరాయనునటులు దోపింపజేయగల నీ 'యాంధ్ర వివేకా నందు'ని నాంధ్ర లోకమునకు బ్రసాదించిన యీ ధన్యురా లగు మాత, తోటి ఆంధ్ర మహిళయేనని 'ఆంధ్ర మహిళ' సగర్వముతో నానందించు చున్నది; ఇంకను ముందుముందు ఆంధ్ర రాష్ట్రమున రాగల నూతన చైతన్యమును దలంచుకొని మురియుచున్నది. (కె. సు.)

★ గ్రంథ సమీక్ష ★

Edited and published by G. Durgabai, M.A., B.L., at the Andhra Mahila Sabha, Mylapore, Madras.
Printed by M. Satyanarayana at the Hindi Prachar Press, 12, Thanikachalam Chetty Road, T'Nagar, Madras.

ఆంధ్రచలన చిత్రరంగమున కొక అపూర్వ శోభ

శ్రీ వెంకట్రామా పిక్చర్సువారి మహత్తర పౌరాణిక గాథ

కవి:
బలిజేపల్లి

నృత్యం:
వెంపటి

సంగీతం:
మోతీబాయి

ఆర్టు:
టి. వి. యస్. శర్మ

స్టూడియో:
శోభనాచల



★

అద్దంకి
పారుపల్లి
రఘురామయ్య
ఎ. వి. సుబ్బారావు
సదాసివరావు
వి. కోటీశ్వరరావు
నాగుమణి
రామారావు
జయమ్మ, సరోజ
సౌదామిని, శ్రీరంజని
టి. కనకం, అనసూయ.

★

బ్రహ్మరథం

దర్శకుడు: చిత్రపు నారాయణమూర్తి బి. ఎ.

ఆంధ్ర:— పూర్ణా పిక్చర్సు, గాంధినగర్, బెజవాడ.

రాయలసీమ:— మల్లికార్జున పిక్చర్సు, నంద్యాల.

నైజాము:— దక్కన్ ఫిలిం డిస్ట్రిబ్యూటర్సు హైద్రాబాద్.

వివరములకు:—

టి. పి. సుందరం

బాలాజీనగర్ :: రాయపేట, మదరాసు.


For
Gold,
Diamond
&
Jewellery
J. S. Pillai